ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 50 నవంబర్ 2017 సంచిక : 11

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 50 నవంబర్ 2017 సంచిక : 11

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. అన్తకాలము - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. మహాత్ముల ప్రబోధము - శ్రీ రామకృష్ణ పరమహంస - 15
04. పురోభివృద్ధిని గోరువారు పూర్వ వృత్తాంతమును మరువగూడదు
- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 16
05. మనోదౌర్బల్యమే మనిషి పతనానికి మూలం -
-శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణరామానుజజీయరుస్వామివారు - 19
06. శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు
- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 22
07. కథాత్మక గీతా సూక్తులు - ఆచార్య కె.సర్వోత్తమరావు - 25
08. భాగవత కథలు- భక్త ధ్రువుడు - శ్రీరామచంద్రడోంగ్రే మహరాజ్ -30
09. పుష్పదంత విరచిత శివమహిమ్న స్తోత్రమ్ - శ్రీమధుసూదనీవ్యాఖ్య - 34
10. శ్రీ మదాంధ్ర మహాభాగవతము - ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 39
12. వార్తలు - 42

ముఖచిత్రం :

శ్రీకృష్ణపరమాత్మ గీతోపదేశము

నవంబరు 29 తేది బుధవారం గీతా జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్ధన

1. సారథ్యమర్జునస్యాదౌ కుర్వన్గీతామృతం దదౌ ।
లోకత్రయోపకారాయ తస్మై కృష్ణాత్మనే నమః ॥

2. గీతాకల్పతరుం భజే భగవతా కృష్ణేన సంరోపితం
వేదవ్యాస వివర్ధితం శ్రుతిశిరోబీజం ప్రబోధాంకురమ్ ।
నానాశాస్త్రరహస్య శాఖమరతి క్షాన్తి ప్రవాళాంకితం
కృష్ణాంఘ్రిద్వయభక్తి పుష్పసురభిం మోక్షప్రదం జ్ఞానినామ్ ॥

3. శుద్ధాం సనాతనీమమ్బాం శోకమోహవినాశినీమ్ ।
కృష్ణస్వరూపిణీం గీతామిష్టదేవీం భజామ్యహమ్ ॥

తా ॥ పూర్వం అర్జునునకు రథసారథ్యాన్ని చేస్తూ, ముల్లోకాలకు ఉపకారం కోసం గీతామృతాన్ని ఇచ్చిన శ్రీకృష్ణపరమాత్మకు నమస్కారం.

భగవంతుడైన శ్రీకృష్ణునిచే నాటబడినది, వేదవ్యాస మహర్షిచే పెంచబడినది, ఉపనిషత్తులను విత్తనంగా గలది, ప్రబోధములనే అంకురములు కలది, అనేక శాస్త్ర రహస్యాలను కొమ్మలు గలది, వైరాగ్యం, సహనం అను చిగురుటాకులు గలది, శ్రీకృష్ణ భగవానుని పాదపద్మాల యందు భక్తియను పుష్పముల గంధము గలది, జ్ఞానులకు మోక్షాన్నిచ్చేది యగు గీతాకల్పవృక్షాన్ని నేను భజిస్తున్నాను.

శుద్ధమైనది, సనాతనమైనది, శోకమోహాలను నశింపజేసేది, శ్రీకృష్ణపరమాత్మ స్వరూపమైనది, ఇష్టదేవతయగు గీతను (భగవద్గీతను) నేను భజిస్తున్నాను.

4-11-2017 తేది కార్తీక పౌర్ణమి, మఱియు గురునానక్ జయన్తి
23-11-2017 తేది పుట్టపర్తి శ్రీ సాయిబాబా జయన్తి



అన్తకాలము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

జీవుని ప్రయాణములో అన్తకాలము (మరణకాలము) చాల విలువైనది. జీవుని మరుజన్మ విషయంలో, లేక భగవత్సాయుజ్య విషయంలోను మరణ కాలము చాల కీలకపాత్రను పోషించుచున్నది. ఈ విషయమై అర్జునుని ప్రశ్నకు భగవానుడు భగవద్గీతలో ఈవిధంగా సమాధాన మొసంగెను. – “అన్తకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కలేబరం। యః ప్రయాతి సమద్భావం యాతి ” – ఎవడు మరణకాలంలో కూడ నన్ను స్మరించుచు శరీరమును విడిచిపోవుచున్నాడో అతడు నా స్వరూపమును పొందుచున్నాడు ” అని. ‘అన్తకాలేచ’ – మరణసమయమున గూడ ఎవడు పరమాత్మనే స్మరించుచు శరీరమును వీడునో, అతడు తప్పక ఆ పరమాత్మస్వరూపమునే పొందగలడని చెప్పబడినది. ఇచట ‘చ’ అనుపదము బాగుగ్రగహింపదగియున్నది. సంస్కృతములో ‘చ’ అనగా ‘కూడ’ అని యర్థము. అంత్యకాలమందుగూడ నన్నేస్మరించువాడు ముక్తిని బొందునని శ్రీకృష్ణమూర్తి చెప్పుటవలన, జీవితకాలమందును, అంత్యకాలమందును గూడ దైవచింతన చేయవలసియుండునని స్పష్టమగు చున్నది. అట్లుకానిచో ‘కూడ’ అనుపదమునకు అర్థమేయుండదు. భగవంతుడు ‘అన్తకాలే ఏవ’ (అంత్యకాలమందే) అనిచెప్పలేదు. అట్లు చెప్పియుండినచో సోమరులకు చక్కటి అవకాశము చిక్కియుండెడిది. కాని మనుజులను సోమరులుగా తయారుచేయుట భగవానుని యభిమతముకాదు. ‘తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర’ (కాబట్టి ఎల్లకాలములందును నన్ను స్మరింపుము) అని

ముందుముందు గీతాచార్యులు ఈశ్లోకతాత్పర్యమును ఇంకను చక్కగ విశదీకరింపగలరు.

జీవితమంతయు నిరంతర దైవచింతనచేయువారికే చివరికాలమున దైవస్మరణ కలుగగలదు. పూర్వజన్మ పుణ్యసంస్కార బలము గల ఏ ఒకానొక మహానుభావునకో తప్ప తక్కిన ఎవరికిని మరణకాలమున అకస్మాత్తుగ దైవభావము కలుగదు. దానికి పూర్వమెంతయో గొప్పసాధన(Preparation) ఉండవలెను. ఒక నాటకము వేయవలెననిన అందలి పాత్రలు అభినయమును ఎన్నినెలల నుండియో బాగుగ అభ్యసించుచుందురు. ఒక విద్యార్థి పరీక్ష 'ప్యాసు' కావలెనననిన సంవత్సరమంతయు బాగుగ చదువవలసి యుండును. సరిగా పరీక్షరోజుననే పుస్తకముతెరచినచో అంతగా ప్రయోజనముండదు. అట్లే మరణకాలమునకు ఎంతయోముందుగనే మనుజుడు తన చిత్తమును లెస్సగ భగవన్మయముగ నొనర్చియుంచుకొనవలెను. అత్తఱి అంత్యమందు సునాయాసముగ దైవస్మరణ కలుగుటకు అవకాశముండును. మఱియు పగలంతయు ఎట్టి భావములతో గూడియుండునో, రాత్రి స్వప్నమందును అట్టి భావములే కలుగుచుండును. ఆ ప్రకారమే జీవితమంతయు ఎట్టిభావములు, సంకల్పములు గలిగియుండునో, అంత్యకాలమందును అవియే జ్ఞాపకమునకు వచ్చును. కాబట్టి అంత్యకాలమున భగవత్స్మరణ కలుగుటకు సహాయభూతముగ నుండుటకై జీవితమంతయు భగవచ్చింతన, ధ్యాన, విచారణాదులను లెస్సగ గావింపవలెను. మనస్సు ఉత్తమదైవసంస్కార పూరితము కావలెను. మరణకాలమున ఒక్కొక్కప్పుడు దేహము కఫవాత పిత్తములచే వివశమైయుండును. లేక స్మృతితప్పియుండును. కాబట్టి సరిగా అదేసమయమున అకస్మాత్తుగ దైవచింతన ప్రారంభించదలంచుట ప్రయాసకరముగ నుండును. ఒక్కొక్కప్పుడు అసలు సాధ్యపడనూపడదు. కావున అంత్యకాల సత్సంస్కారముకొఱకై జీవితమంతయు చిత్తమును పరమార్థమయముగ నొనర్చుకొనవలెను.

'అన్తకాలేచ' అనిచెప్పుటలో ఇంకొక రహస్యమున్ను గలదు. మాయ మహాలబలవత్తరమైనది. అది జీవుని మోసగించుటకై నిరంతరము కాచుకొనియే యుండును. కావున ముముక్షువు దైవవిషయమున అంతిమశ్వాస వదలువఱకును బహుజాగ్రత్తగా నుండవలెను. కనుకనే గీతాచార్యులు 'అంత్యకాలమందుగూడ నాస్మరణను వదలరాదనియు, అట్లు స్మరించువాడే ముక్తినిబొందు' ననియు సెలవిచ్చిరి. ఏమాత్ర మొకింత దైవవిస్మరణ జరిగినను దానినే మాయ ఊతగదీసికొని విజృంభించి జీవుని సంసారగర్తమున పడద్రోసివేయగలదు. పడవచే సముద్రమునంతను కష్టపడి దాటిదాటి సరిగా తీరమునకు వదిగజములదూరములో అజాగ్రత్తగనున్నచో మనుజు డెట్లు మునిగిపోగలడో నిచ్చెన ఎక్కి ఎక్కి చివర ఒక మెట్టున్నదనగా అజాగ్రతవహించినచో ఎట్లుపడిపోవునో, ఆలాగుననే జీవితమంతయు దైవకృషి చేసినను, చివరిరోజులలో దానిని వదలివేసినచో మాయ ప్రవేశించి విమోహమును గలుగజేయవచ్చును. గనుక పై హెచ్చరిక చేయబడినది. ఈ సందర్భమున శ్రీవసిష్ఠమహర్షి శ్రీరామచందునకు గావించిన హితబోధ స్మరింపదగియున్నది.

తవ నావహితం చిత్తం కామః కవలయిష్యతి

సావధానస్య బుద్ధస్య పిశాచః కిం కరిష్యతి (యోగవాసిష్ఠము)

ఓ రామచంద్రా ! అజాగ్రతగనున్నచో నీచిత్తమును కామము మ్రింగివేయగలదు. జాగ్రతగనున్నవాని చిత్తమును (కామ) పిశాచ మేమిచేయగలదు ?.

'మామేవ' - (నన్నే స్మరించుచు) 'ఏవ' అను పదము ప్రయోగించుటవలన ఒక్క భగవంతునిదప్ప ఇతరమగు దేనిని చింతించరాదని తెలుపబడినది. ఏలయనిన, అట్లు దృశ్యవస్తువులను

గూడ చింతించుచుండినచో చిత్తమునకు విక్షేపముగలుగ, దైవధ్యానము సరిగాజరుగదు. ధ్యేయమందు మనస్సునకు నిలుకడ చిక్కదు. మనస్సు ఏకాగ్రముగనున్నపుడే దానిబలము హెచ్చును. కాబట్టి ఒకేదైవవస్తువునందు చిత్తమును సంలగ్న మొనర్చియుండవలెనని బోధింపబడినది.

ఇక ఆప్రకారముగ అంత్యకాలమందుగూడ భగవత్స్మరణ చేయువానికి కలుగు ఫలితమేమి? 'మద్భావం యాతి' – నా స్వరూపమునే పొందును. ఫలితము తెలిసియుండినచో కార్యాచరణమందు విశేష ప్రవృత్తి సంభవించును. దైవస్మరణకు ఫలితము దైవసాక్షాత్కారమే, స్వస్వరూపాత్మానుభవమే, మోక్షమే. కాబట్టి అట్లు అంత్యకాలమందును నిరంతర భగవత్సర్మణ, చింతన చేయువాడు ఘోరసంసార దుఃఖమును దాటి పునర్జన్మరహితుడై, శాశ్వత బ్రహ్మపదవి నొందగలడని ఇచట చెప్పబడినది. ఇంతియేకాదు. ఈ విషయమై యెవరికైనను సందేహముదయించునేమోయని తలంచి "నాస్త్యత్రసంశయః".– ఇట ఏ మాత్రము సంశయము లేదు, నిక్కముగ వారు పరమాత్మపదమును బొందగలరు. ఇది ముమ్మాటికిని నిశ్చయము." అని శ్రీకృష్ణపరమాత్మ కరుణతో నుపదేశించిరి. దయార్ద్రహృదయుడగు భగవానుడు భక్తులపై అపారకరుణను ఈ ప్రకారముగవర్షించి జనులకు తన వాక్యములపై విశ్వాసమును గలుగజేయుచున్నారు. కాబట్టి ముముక్షువులిక సంకోచమును విడనాడి చిన్న చిన్న ఫలితములు కాక సాక్షాన్మోక్షమే ఫలితముగా గలదియు, నిరతిశయానందమే గమ్యముగా గలదియు నగు ఈ మహత్తర దైవస్మరణను శ్రద్ధాభక్తులతో నిరంతరము కొనసాగించవలెను.

ఏలననగా జీవుడేభావముతో శరీరమును వీడునో ఆ రూపమునే పొందును. ఈ విషయమునే భగవంతుడు

"యం యం వాఽపి స్మరన్ భావం త్యజత్యన్తే కలేబరమ్

తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః (గీత 8-6)

అర్జునా ! ఎవడు మరణకాలమున ఏయేభావమును (లేక రూపమును) చింతించుచు దేహమును వీడునో వాడట్టి భావముయొక్క స్మరణచే గలిగిన సంస్కారము గలిగియుండుటవలన ఆయా రూపమునే పొందుచున్నాడు అని తెలిపెను.

మనుజుడు నిరంతరము దేనినిగూర్చి చింతించుచుండునో దానిని గూర్చిన సంస్కారమే అతని చిత్తమున ఏర్పడును. కావున అంత్యకాలమున చిత్తమం దేసంస్కార ముండునో తదనుగుణ్యమగు జన్మనే (శరీరమునే) యాతడు పొందునని యిట చెప్పబడినది. జడభరతుడు అంత్యకాలమున లేడినిగూర్చి చింతించుచు మఱుజన్మయందు లేడియై పుట్టినట్లు భాగవతమున పేర్కొనబడియున్నది. 'యద్భావం తద్భవతి' ఎట్టి భావము గలిగియుండునో అట్టి రూపమునే పొందును. అయితే ఆ అంత్యకాల సంస్కారము జీవితకాల నిరంతర ప్రయత్నముపై ఆధారపడియున్నది. "సదా తద్భావభావితః" జీవితమంతయు దేనిని చింతించుచుండునో చివరిరోజులలోను అదియే చింతన మనస్సునకు వచ్చును. మరణకాలమందును ఆ సంస్కారమే ప్రబలముగనుండును. అందుచే మరణానంతరము ఆయా రూపములనే ఆతడు పొందుచుండును. కాబట్టి జీవితమంతయు క్షణికములగు దృశ్యవస్తువులగూర్చిన విచారణలతో వెళ్లబుచ్చక, పరమాత్మచింతన చేయుచుండుచో అట్టి దైవసంస్కారమే మనస్సునందు రూఢిపడ, అంత్యకాలమందును దైవస్మరణయే ఆతనికి కలుగును. తత్ఫలితముగ నతడు భగవదైక్యమును, ఆత్మసాయుజ్యరూప మోక్షమును బొందును (స యాతి పరమాంగతిమ్). కాబట్టి అంత్యకాల సత్సంస్కారమును రూపొందించుటకొఱకై జీవితమంతను తత్సంబంధమైన

అభ్యాసమే చేయవలెను. ప్రపంచములోకెల్ల సర్వోత్తమ పదవి, దుఃఖరహితమగు నిరతిశయానంద పదవి ఆత్మసాక్షాత్కారమే (భగవత్సాయుజ్యమే). కావున ఆ దైవ సంస్కారము మనస్సునందు రూఢిపడుటకొఱకై జీవితమంతయు భగవచ్చింతన, స్మరణ, విచారణ, ధ్యానాదులను నిరంతరము జరుపవలెను. దైవసంస్కారము ఒక్క క్షణములో ఏర్పడునదికాదు. దానికి అనవరత ప్రయత్నమవసరము. జీవితమంతయు సదా విషయ సముపార్జనయందు భోగజాల సంగ్రహణములందు గడపివైచినచో అంత్యకాలమున దైవసంస్కారము, దైవస్మరణము ఎట్లేర్పడగలదు? కావున అపుడు పశ్చాత్తాపపడవలసి వచ్చును.

ఇక్కారణమున బాల్యయౌవనములందే, శరీరము ఆరోగ్యముగ నున్నపుడే, వార్ధక్యము రాకమునుపే జీవుడు పరమార్థసాధనయం దారితేరియుండవలెను. ఉత్తమ దైవసంస్కారము నేర్పఱచుకొనవలెను. బంధమునకు, మోక్షమునకు తానే కర్త. ఉత్తమజన్మగాని, నికృష్టజన్మగాని, జన్మరాహిత్యముగాని తన చేతులలోనే యున్నది. అవియన్నియు జీవుని అంత్యకాలభావనపై, సంస్కారముపై ఆధారపడియున్నవి. కనుకను, ఆ సంస్కారము యావజ్జీవిత సాధనలపై ఆధారపడియున్నది కనుకను, జీవుడు మొదటినుండియు బహుజాగరూకుడై తనచిత్తమును దైవమయముగ గావించుకొనుచుండవలెను. 'తస్మాత్సర్వేషు కాలేషు...' అను రాబోవు శ్లోకముద్వారా ఈ విషయమునే భగవానుడింకను విశదముగ బోధింపనున్నారు. అయితే జీవితమంతయు సత్సంస్కారములు గలిగి, అంత్య కాలమున ఒకవేళ కఫవాతపిత్తముల ప్రకోపముచే ఎవనికైన విస్మృతి సంభవించినను, ఆతని సద్గతి కేమియు లోటుండదని గ్రహించవలెను.

అంత్యకాలంలో దైవస్మరణ కలుగుటకు యావజ్జీవితం దైవ సంస్మరణము ఉండాలి.

తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్యచ

మయ్యర్పితమనోబుద్ధిర్మామేవైష్యస్యసంశయః.

ఎల్లకాలములందును నన్ను స్మరించుచు (నీ స్వధర్మమగు) యుద్ధమును గూడ జేయుము. ఈ ప్రకారముగ నాయందు సమర్పింపబడిన మనోబుద్ధులు గలవాడవైనచో నీవు నన్నే పొందగలవు. ఇట సంశయము లేదు.

వ్యాఖ్య : 5వ శ్లోకమున అంత్యకాలమందుగూడ (అన్తకాలేచ) భగవచ్చింతన చేయువారికి పరమాత్మ పదవి సంప్రాప్తించునని తాను వచించిన వాక్యమును 'అంత్యకాలమందు మాత్రమే దైవచింతన చేయవలె' నని కొందఱు అర్థముచేసికొని జీవితకాలమంతయు సోమరులుగనుండి, విషయ చింతనలో గడిపి దైవధ్యానమునకై వార్ధక్యము వఱకు లేక మరణకాలమువరకు వేచియుందురేమోయని తలంచి అట్టి ప్రమత్తులకు తగిన పాఠము బోధించుటకు కాబోలు, వారిని తీవ్రముగ హెచ్చరించుటకు కాబోలు భగవానుడీ శ్లోకమును మరల చెప్పినవారైరి. 'అన్తకాలే చ' అను పై శ్లోకమునకు 'తస్మాత్ సర్వేషు కాలేషు ' అను ఈ శ్లోకము భాష్యముగా నున్నది. అందువలన (తస్మాత్) 'ఎల్లకాలములందును నన్ను స్మరింపుము'. 'తస్మాత్' అను పదమును ప్రయోగించుటవలన నిరంతర దైవచింతన వలననే పైనదెల్పిన అంత్యకాలసంస్మరణ భాగ్యము లభించునని స్పష్టమగుచున్నది. దీనిచే కేవల మొక వార్ధక్యమే, లేక మరణకాలమే భగవత్స్మరణకు కాలము కాదనియు బాల్యయౌవనములందు గూడ దైవచింతన చేయవలెననియు అర్థమగుచున్నది.

ప్రకాశము అంతరించినచో వెంటనే అంధకారమావరించునట్లు,

భగవచ్చింతనను మఱచినచో మాయ తత్క్షణమే వచ్చి జొరబడుటకు అవకాశముకలదు. కాబట్టి సప్తాహాది మహోత్సవములందు అఖండదీపమును వెలిగించుచందమున హృదయ కుహరమున దైవస్మృతినిత్యము వెలుగు లాగున చూడవలెను.

'అనుస్మరన్' – స్మరన్ అని చెప్పక అనుస్మరన్, అని చెప్పుటవలన పరమాత్మను మాటిమాటికి స్మరించుచుండవలెనని బోధపడుచున్నది. శ్రవణ, మనన, నిదిధ్యాసనములను విడువకుండ నాచరించుచుండవలెను. ఏదైన ఒక భావము హృదయమందు లెస్సగరూఢిపడవలెననిన స్మరణము చాలదు. అనుస్మరణము (మాటిమాటికి స్మరించుట) ఉండవలెను. ముందుగా టిక్కెట్టుకొని సిద్ధముగానున్నవానికి రైలు ఎప్పుడువచ్చినను దిగులు లేనట్లు, జీవితకాలమంతయు భగవచ్చింతన గలవానికి చిత్తము భగవన్మయమై, దైవసంస్కారపూరితమై యుండుటవలన ఆతనికి మృత్యువు ఎపుడు తటస్థించినను ఆనందముగనే యుండును.

అయితే కొందఱిట్లు ప్రశ్నించుదురు. 'అయ్యా, నిరంతరము దైవమును చింతించు చుండవలెనని చెప్పుచున్నారే, అట్లు చేయుచుండినచో ఇక మా జీవితచర్య ఎట్లు కొనసాగగలదు ? కుటుంబమును పోషించుకొనుట ఎట్లు?' –అట్టి వారికి తగిన సమాధానమును భగవానుడీ శ్లోకమందు జెప్పెను. 'మాం అనుస్మర యుధ్య చ ' – 'నన్ను స్మరించుచు యుద్ధమును గూడ జేయుము '– ఇదియే ఆ సమాధానము. అర్జునుడు క్షత్రియుడు కావున అతని స్వధర్మమగు యుద్ధము ప్రస్తావించబడెను. తక్కినవారు వారివారి వర్ణోచిత, ఆశ్రమోచిత క్రియలను గావించుచు పరమాత్మను సంస్మరించు చుండవలెనని భావము. జనులు వారి వారి దైనందిన కార్యములను – పౌరోహిత్య, వ్యాపార, వ్యవసాయ, సేవాదికృత్యములను నిరాటంకముగజేసికొనుచు భగవత్స్మరణను మాత్రము

విడువకుండ నుండవలెను. అర్జునుడు శ్రీకృష్ణుని ముందు పెట్టుకొని, వారినే చూచుచు, స్మరించుచు యుద్ధమను భీకరకార్యమునే నిర్వహింప గల్గినపుడు, తక్కినవారు భగవత్స్మరణచేయుచు వారివారి సంసారకార్యములను ఏల నిర్వహింపలేరు ? తప్పక నిర్వహించుకొన వచ్చును. అట్లు కావింపవలెననియే భగవదాదేశము.

'మయ్యర్పితమనోబుద్ధిః '– మనుజుని మనస్సు, బుద్ధి ఎప్పుడు నిరంతరము భగవంతునియందే సమర్పితమై యుండునో, అపుడాతడు భగవత్సాయుజ్యమును తప్పక పొందగలడని యిచట చెప్పబడినది. ఇచట మనస్సుతోబాటు బుద్ధినికూడ జేర్చుటలో ఒక విశేషము కలదు. మనస్సు సంకల్పించును. బుద్ధి నిశ్చయించును. మనస్సు సంకల్పించినదానిని బుద్ధి నిశ్చయించనిచో, ధ్రువపఱచనిచో ఆ పదార్థమునందు మనస్సు నిశ్చలముగ నిలువదు. కాబట్టి మనస్సుతోబాటు బుద్ధినిగూడ కూడగట్టుకొని పరమాత్మయందు నిలుపవలెను.

'అసంశయః'– అట్లు చేసినచో నిస్సంశయముగ దైవ సాక్షాత్కారము కలుగగలదని నొక్కి చెప్పడమైనది. రెండు శ్లోకముల క్రిందటనే (5వ శ్లోకమున) 'నాస్త్యత్రసంశయః' – (ఈవిషయమున సందియములేదు) అని చెప్పి మరల వెనువెంటనే 'అసంశయః' అని పలుకుట వలన ఆ వాక్యములు పరమసత్యములని, వానిపై విశ్వాసము గలిగి తద్రీతి తప్పక ననుష్ఠింపవలెననియు బోధించినట్లైనది. జీవుడు తాను చేయవలసినది చేసినచో ఈశ్వరుడు తానివ్వవలసినది తప్పక ఇచ్చును. జీవుడు (తన) మనోబుద్ధులను నిరంతరము దైవమునకర్పించినచో బ్రహ్మసాయుజ్యము దాని అంతటనదియే వచ్చి చేరును. కావున జనులు తమ మనోబుద్ధులను దృశ్య విషయములనుండి మరలించి దైవమందు సంస్థాపితము చేయవలెను. అపుడే తాము వాంఛించు పరమానందరూప లక్ష్యము చేకూరగలదు.

మహాత్ముల ప్రబోధము

- శ్రీ రామకృష్ణ పరమహంస

1. జలమంతయు నారాయణ స్వరూపం అని చెప్పినంత మాత్రాన వివిధ స్థలాలో లభించే అనేక రకాల నీరు త్రాగడానికి వీలు పడదు గదా! ఒక స్థలంలో లభించు నీరు శరీరాన్ని శుభ్రం చేసుకోడానికి పనికి వచ్చును. మరోచోట లభించే నీరు దైవపూజా కార్యక్రమాలలో వినియోగించుటకు మఱియు త్రాగుటకు ఉపయోగించువచ్చును. అలాగుననే మానవులందరు దైవస్వరూపులైనను అందరితో సహవాసము చేయుట మంచిదికాదు. మహాత్ములను సేవించాలి. అతిథులను ఆదరించాలి. దుష్టుల నుండి దూరం తొలగిపోవాలి. దుష్టుల సాంగత్యం చేస్తే మానవుడు అధోగతి పాలవును. కాబట్టి సత్సాంగత్యాన్ని అవలంబించి సత్స్వరూపుడగు పరమాత్మను కనుగొనాలి.

2. భక్తుడు ఎల్లప్పుడును సజ్జన సాంగత్యం చేయాలి. దేవుని ఎడల భక్తిభావం లేనివారి సహవాసం చేస్తే అతనికి అంతవరకున్న భక్తి కూడ అదృశ్యమైపోగల ప్రమాదం వుంది. సత్పురుషుల సాంగత్యంచే జనుల మనస్సు పరిశుద్ధమై వారు పరమానందాన్ని బడయుదురు. భగవంతుణ్ణి దర్శింపగోరేవాడు విశ్వమంతటా ఏకత్వం వెలయుచున్నట్లు భావించును. కాని అజ్ఞానులు ప్రపంచంలో భిన్నత్వాన్ని గాంచుదురు. వాస్తవంగా జగత్తంతా ఏకరూపుడగు భగవంతుని యందే యున్నది. కాబట్టి ఏకత్వాన్ని చూడడానికి ప్రయత్నించాలి.

3. ఎలుక బొరియలు (బొక్కలు) అనేకం కల ఒకే తోట లోనికి ఎంతకాలం నీరుపెట్టినా నీరు నిలువదు. అలాగే దృశ్య సుఖాలను, పేరు ప్రతిష్ఠలను కోరు భక్తుడు చిరకాలం భగవంతుని ఆరాధించినా పరిపూర్ణ జ్ఞానాన్ని పొందలేడు. అతని కాలమంతా కోరికలను పూర్తి చేసుకోవడంలోనే గడచిపోవును. కావున వైరాగ్యం కలిగి దైవధ్యానం చేయువాడు శీఘ్రంగా జ్ఞానాన్ని పొంది ముక్తుడగును.

4. భగవంతుని సేవకుడు, భక్తుడు మఱియు పిల్లవాడు ఈ ముగ్గురి అహంకారం నీటిపై గీత (వ్రాత) వంటిది. నీటిపై వ్రాసిన అక్షరం భక్తులందు జ్ఞానులందు ఎక్కువసేపు ఉండజాలదు. అట్లే అహంకారం పూర్తిగా నిర్మూలింపబడి, లోకవ్యవహారాన్ని నిర్వహించడానికి చాలినంత "నేను" అనుభావం మాత్రం ఉండును. దానివలన వారు తిరిగి బంధనంతో తగుల్కొనరు.

పురోభివృద్ధిని గోరువారు పూర్వ వృత్తాంతమును మరువగూడదు

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

(గత సంచిక తరువాయి)

పుణ్యపురుషులు పరిశుద్ధాత్ములును, దైవకృపయు గురుకరుణయు గలవారలు తమయొక్క నైజగుణమును ఎట్టి విపత్తులలోగూడ విడనాడరు. వారికి ప్రాణహాని గలుగునా యని యేలాటి విచారము గలుగదు కాని, తమయొక్క వ్రతభంగము గలుగునా యని మాత్రము సదా భయము గలిగి యుందురు. వ్రతనియమము గలిగియుండిన ప్రాణభయము గలుగదు. ఏలన, వారి వారి ధర్మము వారి వారిని సదా సంరక్షించు చుండును. అట్టి ధర్మదేవత ఎల్లప్పుడున్ను వారిని కనిపెట్టి రక్షించు చుండును. అగ్ని ఏలాగున తన యొక్క ప్రకాశము విడిచి యుండుట లేదో, జలమేలాగున తన యొక్క ద్రవత్వమును విడుచుట లేదో, వాయువేలాగున తనయొక్క చలనత్వము ద్యజించి యుండుట లేదో, ఆకాశమేలాగునచ తనయొక్క స్వచ్ఛత్వము నుపేక్షించి యుండుట లేదో-అలాగున పుణ్యపురుషులు తమ యొక్క ధర్మమును విడిచి యుండరు. సూర్యుడేలాగున తన ప్రకాశము వీడియుండుట లేదో, చంద్రుడేలాగున తన శీతలత్వమును విసర్జించి యుండుట లేదో, చక్కెర యేలాగున తన యొక్క మాధుర్యమును వదలి యుండుట లేదో, అలాగున నిర్మల జీవులు తమ యొక్క పావనత్వమును త్యజించి యుండరు. ఇదే దీనికి గురుతు. తీవ్ర ముముక్షుత్వమున్న వారందరును ఈలాటి స్వభావము గలవారై యుందురు.

ఈ జన్మములోనే, ఈశ్వర సాక్షాత్కార జ్ఞానము గలుగవలయును.

మనశ్శాంతి పొందవలయును, అజ్ఞానమును నశింపచేయవలెను. తాపత్రయాన్ని శాంతి నొందించవలెను. జన్మ సాఫల్యమును చేసికొనవలెను. జన్మము సార్థకము కావలెను, వంశమును పావన మొనర్చవలెను, కన్నందులకు తల్లిదండ్రులను గూడ పావనుల నొనర్చవలెను, లేనిచో మరణించుటయే మేలను స్వభావము గల్గి యుండవలెను. భూలోకములో జనులకు కొరత లేదు. ఎన్నియో కోట్ల జనమున్నారు. వీరందరును చనిపోయెదరు. మనమున్ను అలాగున పోవలసిన వారమే. ఇట్టి యవస్థ సార్థక జీవులకున్ను, నిరర్థక జీవులకున్ను, అనర్థ జీవులకున్ను సమానధర్మమై యున్నది. అట్లుండగా ఏల నిరర్థకముగా చావవలెను. మరణమును లక్ష్యము పెట్టక యుండిన మాత్రమే అమృతమును గ్రోలగలము.

అయితే మూఢబుద్ధితో నశింప చేయరాదు. అది ఆత్మహత్యలో చేరిపోవును. అది పాతకము. ధర్మనిర్వహణములో ఈశ్వర ధ్యానములో, బ్రహ్మనిష్ఠలో మాత్రమే ఈ పుణ్యవాక్యము సమన్వయించును. శ్రద్ధ కలిగి వర్తింపనందుచే మనము దుఃఖమునకు వశులగు చున్నాము. ప్రతివారున్ను గురూపదేశము పొందుటకు ప్రారంభించునపుడును. తపస్సు నుద్దేశించి ఇంటి నుండి బయలుదేరుటకు ముందుగాను, బ్రహ్మ విచారము నారంభించుటకు పూర్వమును, సోమరితనమును పెనుభూతమునకు తర్పణ మొనర్చియే బయలు దేరవలెను. అట్లైన అన్నియు నిర్విఘ్నముగ సాధింపగలము, కాయకష్టమును సహించుకొనవలెనని నిశ్చయించు కొనవలెను. ఇంద్రియ చాలపృము నరికట్టవలెనని తీర్మానించు కొనవలెను. జిహ్వ యొక్క రుచి కోరెడు గుణమును కట్టివేయవలెను. అట్లైన మాత్రమే మీరు సుఖముగ, ప్రసన్నముగ, ప్రశాంతముగ గమ్యస్థానము చేరగలరు.

న సౌఖ్యాల్లభతే పుణ్యం కాయక్లేశాదవాప్యతే।
మథనేన యథా క్షీరా న్నవనీతం ప్రజాయతే ॥
మర్దనాదిక్షుదండానాం రసో యద్వత్ప్రజాయతే।
తద్వచ్ఛరీరదండేన మహాధర్మః ప్రజాయతే ॥

శరీర సౌఖ్యమునకు లోబడినవారికి (సోమరితనము గలవారికి) పుణ్యప్రాప్తి గలుగదు. శరీరక్లేశమును సహించి పరిశ్రమ చేయు స్వభావము గలవారికి లభించును. ఏలన, పాలను తరచకపోయిన వెన్న బయలు దేరునా? మథించుట చేతనే లభించును. చెఱకును గానుగలో వేసి సలపక పోయినచో రసముత్పన్న మగునా ? ఆలాగున శరీరములో వ్యాపించి యుండు, ఈశ్వర స్వరూపము లభించుట కూడ ప్రయత్నము వలననే సిద్ధించును. మహాధనమగు జ్ఞానము హృదయమును మథించుట వలననే పుట్టును. సాగరమును మథింపనిచో అమృతముత్పన్నమగునా? శుద్ధ సత్త్వమగు హృదయమను ఈ సాగర మందు నిశ్చల బుద్ధియగు మంథర పర్వతము నుంచి ఈశ్వరాను సంధానమను వాసుకిని కట్టి ధ్యానమను మథనము చేయవలెను. అప్పుడే దైవామృతము లభించును. దాని వలన జనన మరణ రూపమగు దుఃఖ ముపశమించును.

సత్యేన లభ్యస్తపసా హ్యేష ఆత్మా
సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యమ్ ।
అంతశ్శరీరే జ్యోతిర్మయో హి శుభ్రో,
యం పశ్యంతి యతయః క్షీణదోషాః ॥

అనగా " నశించిన పాపములు గలవారలును, సన్న్యాసులు (పరమాత్మ స్వరూపానుసంధానమునకు ప్రయత్నించుచున్న వారలు) ఏ ఆత్మ స్వరూపమును చూచుచున్నారో, ఆ తేజోరూపమును, పరిశుద్ధమును అగు ఆత్మ స్వరూపము – ఎల్లప్పుడున్నూ సత్యము చేతను, తపస్సు చేతను, బ్రహ్మస్వరూప సాక్షాత్కార జ్ఞానము చేతను, బ్రహ్మచర్యము చేతను హృదయ పుండరీకమందు పొందదగినది. " మొదట కొంత కాలము, పై గుణములు గల్గి యుండి తరువాత అవసరము లేదని శుష్క వేదాంతులు కొందరు చెప్పెడి వాక్యము సరికాదని నిరూపించుట కొరకు ఇచ్చట నిత్యశబ్దము ప్రయోగించి యున్నారు. కాన, పై జెప్పిన గుణములన్నియు దేహ పతనము వరకు గల్గి యుండవలెను.

'మనోదౌర్బల్యమే మనిషిపతనానికి మూలం ' – దానిని మట్టుపెట్టాలి

– శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ
రామానుజ జీయరుస్వామివారు

శ్రీ భగవానువాచ :

క్లైబ్యం మాస్మగమః పార్థ ! నైతత్ త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥2అ॥3శ్లో ॥

ప్రతిపదార్థము : పార్థ = ఓ అర్జునా !, **క్లైబ్యం** = దైన్యమును, **మాస్మగమః** = పొందకుము, **ఏతత్** = ఈ దైన్యము, **త్వయి** = నీయందు, **న ఉపపద్యతే** = తగదు, **పరంతప** = శత్రుతాపకుడవైన ఓ అర్జునా ! **క్షుద్రం** = నీచమైన, **హృదయ దౌర్బల్యం** = మానసిక దుర్బలత్వమును, **త్యక్త్వా**=విడిచి, **ఉత్తిష్ట** = లెమ్ము.

తాను సుఖపడడు. ఇతరులను సుఖపెట్టడు. పరులు సుఖపడుతుంటే ఓర్వలేడు. ఇది క్లీబుడి (నపుంసకుడి) లక్షణం. ఇలా నపుంసకులుగా బ్రతకొద్దంటున్నాడు భగవంతుడు. రెంటికీ చెడ్డ రేవడిలాంటి బ్రతుకు తగదంటున్నాడు. ఇది వదలమంటున్నాడు.

ఆత్మన్యూనతా భావం వల్ల ఈ క్లీబత ఏర్పడుతుంది. కర్తవ్యాన్ని విస్మరించడం వల్ల మనో దౌర్బల్యం ఏర్పడుతుంది. ఆలోచనలు క్రమం తప్పితే కర్తవ్యం మరుపుకొస్తుంది. తగనివాటిమీద ప్రేమ ఆలోచనల్ని తప్పుదారి పట్టిస్తుంది. కృప మంచిదేకాని, అది తగని రీతిలో, తగని వాటిపై కలగడమే ప్రమాదకరం. ఎంతటివాడినయినా పాడుచేస్తుంది. హనుమంతునంతటి వానినీ హృదయదౌర్బల్యం ఆత్మహత్య చేసుకుందామా అనేంతవరకు తీసుకెళ్ళింది. ఇది తగదు. హనుమంతుడు సీతాదేవి కన్పించకముందు అన్వేషణ ఇంకా పూర్తి కాకుండానే సీత ఇక దొరకదు అనుకున్నాడు. ""వెనుతిరిగి వెళ్ళి సీత లభించలేదని చెబితే రాముడు ప్రాణం వదులుతాడు. అది చూసి లక్ష్మణుడు ఆపై సుగ్రీవుడు దానివల్ల వానరులు, అది తెలిసి అయోధ్యాపురజనులు, ఇందరూ ప్రాణం వదిలేస్తారు. ఇందరి ప్రాణం తీసేది తానే. సమాచారం చెప్పకపోతే అందరూ ఆశతో బ్రతికి ఉంటారు'' ఇలా వారందరిమీద జాలికలిగినట్లుగా భావించి వెళ్ళొద్దని నిర్ణయించేసుకున్నాడు. వెళ్ళకుండా లంకలో తానుండలేడు. వెళితే వారుండరు. ఇలా జీవించడంకంటే ప్రాణం వదలడమే మేలు అని, ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. నిజానికి హనుమంతుడు వెతకకపోయినా, లంకకు వెళ్ళకపోయినా రాముడెవరో ఒకరిద్వారా సీతా సమాచారం తెలుసుకొని ఉండేవాడే. రావణ వధకూడా చేసియుండేవాడే. హనుమంతుడికా అదృష్టాన్ని కలిగించాడు. నేనే చేసేస్తున్నాననుకున్నాడు హనుమంతుడు. ఆ గర్వం నిరాశ అయి, అది క్లీబతగా మారి ప్రాణానికే ముప్పు తెచ్చుకునేంతవరకు వెళ్ళింది. అయితే బుద్ధిమంతుడు కనుక మరొకడు చెప్పక్కర్లేకుండానే మనోదౌర్బల్యాన్ని వెంటనే దూరం చేసికొని కర్తవ్యాన్ని గుర్తించి పునరన్వేషణ ప్రారంభించాడు. సీత అక్కడే లభించింది. మనో దౌర్బల్యాన్ని ఎలా దూరం చేసుకున్నాడు ? అనేది ప్రశ్న. తాను చేసేది సీతారాముల సేవ కనుక వారే తనకి శక్తినివ్వాలని వారికి శరణాగతి చేసాడు. వెంటనే లభించింది.

అర్జునుడికి తన కర్తవ్యమైన దుష్ట నిర్మూలన చేస్తే బంధువులు పోతారని, స్నేహితులు నశిస్తారని, నరకాలొస్తాయని అనవసర ఆలోచనలు మనోదౌర్బల్యాన్ని తెచ్చిపెట్టాయి. కర్తవ్యాన్ని మరిపించాయి.

రోగం తొలగడానికి శస్త్ర చికిత్స చేయవలసిన వైద్యుడు ఆపరేషన్

రూములో జాలికలిగి, చికిత్సమాని, కత్తిని పారవేసినట్లు అర్జునుడు ధనుర్బాణాలు శ్రీకృష్ణుని ముందరే పారేసి అంత యుద్ధరంగంలోను తన రథంలో చతికిలపడ్డాడు. సహజంగా పరంతపుడు, కాని అసహజమైన కృప వల్ల పనికిరాని క్లీబుడయ్యాడు. రెంటికి చెడ్డ రేవడిలా తయారయిన అర్జునుని శ్రీకృష్ణుడు మేల్కొల్పుతున్నాడు. అతనిని సాకుగ నిలిపి మన మనోదౌర్బల్యాన్ని పారద్రోలుతున్నాడు. ఉత్తిష్ఠ ! అంటూ నిద్రాణమైన సమాజాన్ని మేల్కొల్పుతున్నాడు. కర్తవ్యనిష్ఠులను కమ్మంటున్నాడు.

ఒకడు దేవుడు లేడని అనుకున్నాడు. ఉన్నాడని శాస్త్రం చెప్పింది. పెద్దలూ చెపుతున్నారు. ప్రమాణాల్తో నిరూపిస్తారు. ఐనా తన నిర్ణయానికి విరుద్ధం కనుక, ఆస్తిత్వాన్ని అంగీకరించలేడు. లేదని తాను నిరూపించలేడు. ఉన్నాడన్న వాదనని ఖండించలేడు. ఇదో రకమైన మనోదౌర్బల్యం. అర్జునుడి స్థితి అలాగే ఉంది. మనలో చాలమందిలో ఈ స్థితి ఉంది. పెద్దలంగీకరించనిది, శ్రేయస్సును నాశనం చేసేది, కీర్తిని పాడుచేసేది ఐన మనో దౌర్బల్యాన్ని మట్టుపెట్టి సమాజానికి హాని కల్గించే దుష్ట ప్రవృత్తులను దునిమాడి శ్రీకృష్ణుడు చెప్పే సత్యమార్గములో ముందుకు సాగండి ! పరంతపులు కండి ! బలహీనతలను అణచివేయండి. – (గీతాజ్యోతి నుండి)

7వ జ్ఞాన సదస్సు

2017 డిశంబరు 3వ తేది పౌర్ణమి ఆదివారం నుండి డిశంబరు 8వ తేది బ.పంచమి వఱకు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగనున్నది. ఆచార్యులు పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు.

విషయము : ఐతరేయోపనిషత్తు. 25 మందికి మాత్రమే ప్రవేశము. వసతులు, భోజనాలు అన్నీ ఉచితము. పాల్గొనదలంచిన వారు వెంటనే ఆశ్రమమునకు వ్రాయుడు. **చరవాణి : 08578 222239** సంప్రదించగలరు.

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 2

ఓంకారోపాసన

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు 1913లో కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధమైన తిరుమలకు విచ్చేశారు.అక్కడ పండ్రెండు సంవత్సరాలకు పైగా గోగర్భతీర్థస్థలంలో తపోదీక్ష కొనసాగించారు.

తిరుమలకు వచ్చిన భక్తులు క్షేత్రాధిదేవతయైన ఏడుకొండల దేవుణ్ణి ఎన్నెన్నో వరాలు ప్రసాదించుమని ప్రార్థిస్తారు. శ్రీస్వాములవారు గూడా నాల్గు వరాలు కోరుకొన్నారు.

అతీత వైరాగ్య మఖండ బోధః
కదాను మే సిద్ధ్యతు హే దయాళో !
సమాధియోగస్య పరస్య నిష్ఠా
సర్వేషు భూతేషు సమత్వ బుద్ధిః ॥

వారు కోరిన వరాలు అప్రయత్నంగా ఈసంస్కృత శ్లోకరూపంలో వారి హృదయం నుండి ఆవిష్కృతాలయ్యాయి.

‘ ఓ దయామయుడవైన స్వామీ ! తిరుగు లేని వైరాగ్యం, అఖండమైన జ్ఞానం, నిర్వికల్ప సమాధియోగనిష్ఠ, సర్వ ప్రాణులపట్లా సమబుద్ధి నాకెప్పుడు సిద్ధించునో కదా !”

ఈ నాలుగు వరాలలో చివరి వరం గమనార్హం. సమాజం భేదభావాలతో ఛిన్నా భిన్నం అయివుండగా కేవలం మానవులపట్లనే కాక, సమస్త ప్రాణులపట్లా సమభావన కల్గియుండాలన్న శ్రీ స్వాములవారి హృదయ వైశాల్యాన్ని గూర్చి ఏమని చెప్పగలం ?

తన దగ్గఱకు వచ్చే భక్తులకు గూడా స్వామీజీ ఈ సమభావననే బోధించేవారు. 'సమబుద్ధే యిందరికీ సర్వవేదసారము' అన్న అన్నమాచార్యులవారి సూక్తిని స్వామివారు నిజజీవితంలో ఆచరణకు తెచ్చారు.

1926లో కొండదిగి ఏర్పేడు వద్ద వ్యాసుని పేరుతో ఆశ్రమం స్థాపించారు. ఆంధ్రావనిలోని పలు ప్రాంతాలనుండి భక్తులు శ్రీస్వాములవారి ప్రబోధాలచే ప్రభావితులైనారు. గీత, ఉపనిషత్తులు మున్నగు గ్రంథాలను పఠించడానికి అలవాటుపడ్డారు. కొందరు తమ గ్రామాలలో ఆశ్రమాలను గూడా స్థాపించుకొన్నారు.

అలా ఏర్పడిన ఆశ్రమాలలో కృష్ణాజిల్లాలోని తాడేపల్లిలో రూపుదిద్దుకున్న 'పెద్దాశ్రమం' ఒకటి. వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల ఆ గ్రామజనులు ఆశ్రమానికి వెళ్ళి నిత్యం గీతోపనిషత్తులను పారాయణం చేసేవారు. వారి పారాయణం 'ఓం'కారోచ్చారణతో ప్రారంభమయ్యేది.

తాడేపల్లి సమీపంలో ఉన్న ఘంటసాలలోని సనాతనులు కొందరు వీరి పారాయణ పద్ధతి చూచారు. స్త్రీ పురుషులు ఏ మాత్రం భేదం లేకుండా ప్రణవాన్ని ఉచ్చరించడం చూచి ఒకింత ఆశ్చర్యానికీ, మరికొంత అసహనానికీ గురి అయ్యారు.

వారు పారాయణం చేస్తున్న భక్తులను చూచి " స్త్రీలూ, ద్విజేతరులూ ఇలా ఓంకారోచ్చారణ చేయవచ్చా ! ఇది శాస్త్రానికీ, సంప్రదాయానికీ విరుద్ధం కదా ?" అని ప్రశ్నించారు.

అందుకు ఆ భక్తులు ' మా గురువు గారు చెప్పిన పద్ధతి మేము పాటిస్తున్నాము. ఇది తప్పో, ఒప్పో మాకు తెలియదు. మా గురువుగారు త్వరలో ఇక్కడికి రాగలరు. మీరు వారినే నేరుగా ఈ విషయం ప్రశ్నించండి. వారు మానమంటే మా పారాయణం మానేస్తాము" అని సమాధానం చెప్పారు.

పిదప కొన్ని రోజులకే శ్రీస్వాములవారు తాడేపల్లికి పోవడం

తటస్థించింది. విషయం తెలుసుకున్న సనాతనులు గూడా అక్కడికి వచ్చారు. గ్రామస్థులు గూడా అధిక సంఖ్యలో పెద్దాశ్రమంలో సమావేశ మయ్యారు.

స్వామితో సనాతనులు " అయ్యా ! ఇక్కడ చేరిన స్త్రీలూ, ద్విజేతరులూ రోజూ ఇక్కడ గీతాపారాయణానికి ముందు ప్రణవోచ్చారణ చేస్తున్నారు. ఇది శాస్త్ర విరుద్ధం కదా ! అర్హత లేని వారు ఓంకారాన్ని ఉచ్చరించడం సంప్రదాయ విరుద్ధం కదా ! అని ప్రశ్నించారు.

అందుకు స్వాములవారు ఆ గ్రామస్థులలో వయోవృద్ధుడైన ఒక పెద్దాయనను పిలిచి "మీరు బాల్యంలో చదువుకొన్నారా ? " అని ప్రశ్నించారు. ఆయన " చదువుకొన్నాను" అని బదులు పలికారు.

"మీరు బడిలో చేరిన రోజు మీకు చదువు జెప్పిన గురువెవరు? వారు మొదట మీకు ఏమి నేర్పించారు ? " అని స్వాములవారు మళ్ళీ ప్రశ్నించారు. అందుకా వృద్ధుడు "స్వామీ ! ఈ సనాతనుల తండ్రులూ, తాతలే మాకు చదువు నేర్పారు. మొదట వారు మమ్మల్ని ఓం నమః శివాయ సిద్ధం నమః । అని పలకమన్నారు. పలకలో అదే వ్రాసి చదువమన్నారు " అని చెప్పాడు.

అందుకు స్వామి "ఓహో! అట్లనా " అని చెప్పి సనాతనుల వైపు చూచి " విన్నారా ' ? మీ పెద్దలు వీరికి 'ఓం' కారాన్ని ఐదేండ్ల వయస్సులోనే నేర్పించారు. కాలక్రమంలో వీరది మరచారు. దానిని మరల మేము వచ్చి 'గురువులు నేర్పిన విద్యను మరువరాదు' అని జ్ఞాపకం చేసినామే గాని క్రొత్తగా మేమేదీ నేర్పలేదు" అన్నారు.

అది విని సనాతనులు తమ తప్పు గ్రహించి శ్రీస్వామివారికి సాష్టాంగనమస్కారం చేసి ప్రసాదం పుచ్చుకొని మన్నించండి అంటూ తిరిగి వెళ్ళారు. అలా కుల లింగాదిభేదం లేకుండా సమభావంతో అందరికీ బ్రహ్మవిద్యను బోధించిన మహనీయులు శ్రీ మలయాళయతీంద్రులు.

కథాత్మక గీతా సూక్తులు

- ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

(గత సంచిక తరువాయి)

న హి కల్యాణ కృత్కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి

ఈ వాక్యం ఆత్మసంయమయోగమనే ఆరవ అధ్యాయంలో నలుబదియవ శ్లోక ఉత్తరార్ధం. మంచిపని చేసిన మానవుడు ఎన్నడూ దుర్గతిని పొందడని సారాంశం. మంచిపని అనేకరకాలు. దానధర్మాదులు చేయడం సామాజికోపయోగ సంస్థలను స్థాపించడం, అపకారికి ఉపకారం చేయడం. ఆలాగే దుర్మార్గులలో పరివర్తనకు అవకాశమిచ్చి మంచివారిగా తీర్చిదిద్దడం. ఈ నేపథ్యం గల ఒక మండలాధిపతి కథను ఈ సందర్భంలో అనుసంధానం చేసుకొందాం.

ఒక ఊరిలో ఒక గుడి. ఆగుడి ప్రధాన రహదారికి దగ్గరలోనే ఉంది. ఆ గుడి ముంగిట బిచ్చగాళ్ళెందరో. ఆ బిచ్చగాళ్ళు నానారకాలవారు. కొందరు వికలాంగులు. కొందరు వయోవృద్ధులు. మరికొందరు అనాథులు. సాధారణంగా గుడికి వచ్చేవారు బిచ్చగాళ్ళలో వికలాంగులకు దానం చేస్తుంటారు.

ఆ గుడి ముంగిట గుడ్డివాడయిన ఒక నడిమి వయసువాడు. ఒకప్పుడు అతడు కళ్ళున్నవాడే. కాని మెరపుల కారణంగా చూపులు పోయాయి. చిన్నతనంలో తల్లిదండ్రులు పసివానిని సాకారు. పెంచారు. కాని వారు మరణించాక సోదరులు పట్టించుకోలేదు. చివరకు 'గుడి' ఆశ్రయమయింది. దయతలచి భక్తులు వేసే డబ్బుతో కడుపునింపు కొంటున్నాడు. కాలం గడచిపోతున్నది.

భక్తులు వేసే డబ్బుల్ని ఒక గుడ్డపేలికల్లో జాగ్రత్తగా దాచి

ముడివేసి దగ్గర పెట్టుకొనేవాడు. ఒకరోజు ఆలాగే డబ్బు దాచి 'అల్పశంక' కారణంగా దూరంగా వెళ్ళాడు. దురదృష్టవశాత్తు అపుడు గుడి ముంగిట గుడ్డోళ్ళే వున్నారు. ఒక దొంగ గుడ్డోణ్ణి, గుడ్డోడు డబ్బు దాచడాన్ని, అల్ప శంకకు పోవడాన్ని జాగ్రత్తగా చూచాడు. ఇదే సమయమని పిల్లి అడుగులు వేసుకొంటూ వెళ్ళి డబ్బు దాచిన గుడ్డను అమాంతం ఎత్తుకొని దౌడు తీయబోయాడు. సరిగ్గా అదే సమయానికి ఆలయరక్షకభటుడు అటు రానే వచ్చాడు. దొంగను చూశాడు. పరువులెత్తి ఆ దొంగను పట్టుకొన్నాడు. అర్ధచంద్రాకార ప్రయోగం చేస్తూ దేవాలయధర్మాధికారి దగ్గరికి తీసికెళ్ళాడు.

ధర్మాధికారి ఆ వేళ పండితులతోకాలక్షేపం చేస్తున్నాడు. ఆలయ రక్షకభటుని చూచాడు. అతనితో వస్తున్న ఒక యువకుణ్ణి చూచాడు. 'ఏం పని మీద వచ్చావ్?' అని అడిగాడు ధర్మాధికారి. రక్షక భటుడు అన్నీ సవివరంగా చెప్పాడు. ధర్మాధికారి ఆలోచించాడు. ఏం శిక్ష వేయాలో తోచలేదు. తనముందు పండితులున్నారు. కనుక వారిని చూచి 'ఏ శిక్ష వేయాలో సూచించమన్నాడు'.

పండితులు ఒకరి మొఖం మరొకరు చూచుకొన్నారు. ఒక పండితుడు లేచి 'అయ్యా' దొంగతనం దొంగతనమే. పైగా ఆలయం ముందు దొంగతనం. సర్వేన్ద్రియాణాం నయనం ప్రధానమేకదా ! చూపులు లేని వారి సొమ్ము అపహరించాడు. కనుక దొంగ కళ్ళు పీకేయడమే శిక్ష ' అన్నాడు. మరో పండితుడు లేచి 'అయ్యా! అవధానుల అభిప్రాయంతో నేను ఏకీభవించను. కళ్ళుండేవి శిరస్సులో. ఈ చెడ్డబుద్ధి మెదడులో పుట్టింది. అంచేత తలతీసేయడమే శిక్ష. ఇది తార్కిక' మన్నాడు. మరో పండితుడు లేచి 'అయ్యా' అలా కాదు బుద్ధి మెదడులో పుట్టినా, చూడడం కళ్ళయినా డబ్బు సంచి లాగింది చేతులుకదా. అంచేత చేతులు నరికేయాల్సిందే' అన్నాడు. మరొక సాత్త్వికపండితుడు

లేచి 'అయ్యా కళ్ళు, మెదడు, కాళ్ళు, చేతులు అన్నీ శరీరభాగాలే. అంచేత శరీరానికే శిక్ష. 100 కొరడా దెబ్బలు కొడితే దొంగకు బుద్ధొస్తుంది' అన్నాడు.

ధర్మాధికారి సాంతం విన్నాడు. 'మీ వాదాల్ని కాదనడం లేదు. మన వూరిలో ఇలాంటి దొంగతనం గుడి దగ్గర జరగలేదు. అజాగ్రత గుడ్డివానిలోనూ వుంది. తన ధర్మరక్షణ రక్షకభటునిలో వుంది. కండలు తిరిగిన దొంగలో సోమరితనముంది. అంచేత నేనొక శిక్ష వేయదలచుకొంటున్నా! మీరు అంగీకరిస్తారా ? అని పండితుల్ని చూచి అడిగాడు.

'అయ్యా ! మీరు ధర్మాధికారులు. మీరు చెప్పడమూ మేము అంగీకరించక పోవడమా ? కలలో కూడా ఉండదు. పైగా నాలుగు తరాలనుండి ఈ వూరికి మీరే ధర్మాధికారులు' అన్నారు. ధర్మాధికారి దగ్గరున్న నౌఖర్నిచూచి 'ఒరేయ్ ఓ పొడుగాటి వెడల్పుతువ్వాలు పట్రా' అన్నాడు. తువ్వాలెందుకూ అని పండితులు బుర్ర గోక్కోవడం మొదలుపెట్టారు. నౌఖర్ తువ్వాలు తెచ్చాడు. ధర్మాధికారి నౌఖర్‌తో 'ఒరేయ్!ఆ తువ్వాలుతో చూపు కనబడకుండా ఆ దొంగ కళ్ళకు కట్టేయ్' అని పురమాయించారు. నౌఖర్ అలాగే చేశాడు.

'ఒరేయ్ ! గుడ్డివాడా డబ్బు దొంగలించడమేమిట్రా ! పైగా ఒడ్డూ పొడుగూ వున్నవాడివి. కాయకష్టంతో బతక్కుండా దొంగ బతుకెందుకురా! గుడ్డివాని డబ్బు దొంగలించావు కదా ! అంచేత నీకు ఇదే శిక్ష. ఈ ఒక్కరోజు తలకూ కళ్ళకు చుట్టిన గుడ్డ తీయకుండా నీ పనులన్నీ నీవే చేసుకోవాలి. ఇదే నా శిక్ష 'అన్నాడు.

పండితులు 'ఈలాగయితే ఈ వూర్లో హాయిగా దొంగలు మకాం పెడతారు. అయినా మనకెందుకు ? ఏదో అడిగారు కదా అని మనం చెప్పాం. శిక్ష వేసేవాడు ధర్మాధికారి. శిక్ష అనుభవించేవాడు దొంగ' అని

మనసులో అనుకొన్నారు.

"అమ్మ బాబోయ్ ! పండితులమాట విని తన తలతీయలేదు. కళ్ళు పీకేయలేదు. కనీసం కొరడా దెబ్బలు కొట్టలేదు. బతికిపోయానురా. ఒక్కరోజేగా ! శిక్ష అనుభవించి ఈ వూరొదలి వెళ్ళిపోతా' అని మనసులో అనుకొన్నాడు దొంగ.

శిక్ష మొదలయింది. దొంగ నడవబోయాడు. మిట్టాపల్లం తెలియక జారిపడ్డాడు. నాలుగడుగులు వేసే సరికి దారెటో తెలియక గోడ తగిలింది. నెత్తిమీద కోడిగుడ్డంత వాచింది. ఎవర్రా ! అక్కడ అని కేకవేస్తే ఎవరూ పట్టించుకోలేదు. చివరకు తల్లి దగ్గరికి వస్తే 'ఏమే !, బుద్ధుందా ' తాళి కట్టినవాణ్ణి దెబ్బలు తగిలి నొప్పితో బాధపడుతుంటే కేకలేస్తుంటే ఇపుడేనా రావడం ' అని అరచాడు. వచ్చినామె తల్లి అని తెలిశాక 'అమ్మా' చిన్నప్పుడు చాలా గారాబంగా చూశావు. కళ్ళ కలకతో బాధపడుతుంటే కలతపడిపోయే దానివి. నాగతి చూడమ్మా' అని బావురు మంటూ ఏడ్చాడు.

కాసేపటికి ఎవరో తిండి తెచ్చిపెట్టారు. కాని గదిలో ఎక్కడో ఎలుక చచ్చిపోయింది. ఆ వాసన గుప్పుమంటోంది. కడుపులో దేవి నట్టయింది. తెచ్చిన తిండి నచ్చలేక చేత్తో పళ్ళెం విసరిగొట్టాడు. ఆ పూట ఉపవాసమే మరి. కాసేపు గడిచింది. పలకరించేవారు లేరు. మెదడు మొద్దుబారిపోతుంది.

పగలూ, రాత్రి తెలియడం లేదు. ఇల్లూ పెరడు ఎక్కడో తెలియదు. చివరకు దొంగ ఆలోచించాడు. తన్ను ధర్మాధికారి దగ్గరికి తీసికెళ్ళమని దగ్గరివాళ్ళను బతిమిలాడినాడు. వారూ సరేనని ఆ దొంగను తీసికెళ్ళి నిలబెట్టారు. 'అయ్యా ! ఈ శిక్ష భరించలేను. నన్ను వంద కొరడా దెబ్బలతో కొట్టండి. ఓర్చుకొంటాను. చూపులేక ఇంక ఒక క్షణమయినా ఉండలేను బాబోయ్' అని కాళ్ళ మీద బడ్డాడు. ధర్మాధికారి ఆలోచించాడు.

ఇక శిక్ష చాలనుకొన్నాడు. 'ఒరేయ్! ఒకటి రెండు గంటలు చూపులు లేకపోతేనే అల్లాడి పోయావ్. పెద్ద చిన్న లేకుండా నానా మాటలన్నావ్ ! చూడు ఆ బిచ్చగాడు. కళ్ళు పోగొట్టుకొని జీవితమంతా గుడ్డోనిలా బతకవలసి వచ్చింది. అతనికున్న ఆధారమంతా బిచ్చం డబ్బులు. దొంగతనం చేసేవేళ నీవు ఆలోచించావా ? అని ప్రశ్నించాడు. 'అయ్యా! బుద్ధి గడ్డితిని చేయరాని పనులు చేశా. కొరడా దెబ్బలు కొట్టండి. శిక్ష అనుభవించి ఈ వూరు వదలిపోతా' అన్నాడు. ధర్మాధికారి తన చుట్టూ వున్న పండితుల్ని చూచి 'పరివర్తన శిక్షకు తగిన పరిహారం. ఈ శిక్ష దొంగలో పరివర్తన తెచ్చింది. పరివర్తన వల్ల సమాజంలో ఎన్నో తప్పుల్ని సవరించవచ్చు' అన్నాడు. పండితులు 'భేష్ – భేష్' అన్నారు.

పార్థ నైవేహ నామూత్ర వినాశస్తస్యవిద్యతే ।
న హి కళ్యాణకృత్ కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి ॥

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

01. రమేష్ అమ్మగారి (దిల్‌సుఖ్‌నగర్, హైద్రాబాద్)	రూ.3000/-
02. కె. శంకరయ్య (బెంగుళూరు)	రూ.1500/-
03. రాళ్లపల్లి సుబ్బారావు (గణేశనగర్, వాడపల్లి)	రూ.1500/-
04. దేవులపల్లి కుమార్ (షాద్‌నగర్)	రూ.1500/-
05. అల్లాడ కృష్ణ (పాలవలస – శ్రీకాకుళం జిల్లా)	రూ.1500/-
06. కె.శ్రీహరి (బిధన్‌నగర్, కలకత్తా)	రూ. 1500/-
07. ఎస్.శ్రీధర్ (తడ – నెల్లూరుజిల్లా)	రూ. 1500/-
08. ఏజండ్ల రవీంద్రబాబు (కొణతమాత్మకూరు)	రూ. 2000/-
09. అమ్మాద్రి మల్లికార్జున్ (సదాశివపేట)	రూ. 1500/-
10. పి.జయరామిరెడ్డి (బెంగుళూరు)	రూ. 2000/-

మూలం

భాగవత కథలు – భక్త ధ్రువుడు

శ్రీరామచంద్రడోంగరే మహారాజ్

అనువాదం :

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

మనువుకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అని ఇద్దరు కుమారులుండిరి. భాగవతం 5వ స్కంధంలో ప్రియవ్రతుని వంశవర్ణన వుంది. 4వ స్కందంలో ఉత్తానపాదుని కథయొక్క వర్ణన వుంది.

ఉత్తానపాదునికి సురుచి, సునీతి అని ఇద్దరు భార్యలుండిరి. అందు సురుచి కుమారుని పేరు ఉత్తముడు. సునీతి పుత్రుని పేరు ధ్రువుడు.

ప్రతి జీవుడు ఉత్తానపాదుడే, తల్లి గర్భంలో వుండే జీవులందరు ఉత్తానపాదులే. తల్లి గర్భంనుండి పుట్టేటప్పుడు ప్రతివాని శిరస్సు మొదట, తర్వాత పాదాలు బయటికి వస్తాయి. ఎవని పాదాలు మొదట పైకి వుండి తరువాత క్రిందకు వస్తాయో అతడు ఉత్తానపాదుడు. పుట్టేప్పుడు అందరికి ఈ స్థితే వుంటుంది.

ప్రతి జీవికి సురుచి, సునీతి అని ఇద్దరు భార్యలుంటారు. మానవ మాత్రునికి సురుచి అంటే ప్రియమైనది. ఇంద్రియాలు దేన్ని కోరుతవో అట్టి విషయభోగాల ననుభవించాలనే కోరికే సురుచి. సురుచి అనే దానికర్థం వాసన. నేడు అందరికి సురుచే ప్రియమైన దనిపిస్తూంది. అతడు శాస్త్రాన్ని అడుగడు (శాస్త్రం ఏం చెపుతూంది అని తెలిసికోడు). ధర్మాన్ని గురించి అడుగడు (ఏది ధర్మమని, ఇది ధర్మమా ! అధర్మమా అని తెలిసికోడు), సత్పురుషులను అడుగడు. సురుచి అంటే మనస్సుకిష్టమైన కోరిక. మనస్సు దేనిని అడిగినా (కోరినా) ఆ భోగాలలో వీరమరణానికి ఎవడు ఆతురుడవుతాడో అతడు రుచికి దాసుడు. ఎవనికి రుచిపై ప్రేమగల్గుతుందో అతనికి నీతి ఎలా ప్రియమవుతుంది. నీతి విరోధించు గాక ఐనా ఇన్ద్రియాలు స్వభావతః విషయభోగాల వైపే పరుగెడుతవి. నాలుక దేన్ని అడిగినా వానినన్నిటిని దానికందించవాకు. అనేకమంది సుఫారీతినకుండా ఉండలేరు. సుఫారి మంచిదే, కాని

మోతాదుకుమించి తింటే మనిషి సంయమిగా వుండలేడు. (సంయమనాన్ని కోల్పోతాడు).

మానవమాత్రునికి సునీతిపై అనగా నీతిపై అధిక ప్రేమ వుండదు. సునీతి ప్రియమైనరాణి కాదు. మానవునికి సునీతిపై కాదు, సురుచిపైన ప్రేమ. జీవమాత్రుని విషయంలో ఇది (సురుచిపైననే ప్రేమ అనేది) నిజమైన మాట (సత్యము). అతనికి (సామాన్య మానవునికి) సదాచారంతో కూడిన, సంయమ జీవితం ఇష్టపడదు. జీవుడు వాసనకు లోబడి విలాసవంతమైన జీవనాన్ని గడపడానికి ఇష్టపడతాడు. ప్రాణి నీతికి అధీనుడై (నీతికిలోబడి) వుండడానికి కిష్టపడడు. సురుచికి అధీనుడుగా వుంటే మంచిఫలం లభిస్తుందని అతడనుకుంటాడు. సురుచియొక్క ఫలితం ఉత్తమము. అంచేత సురుచియొక్క కుమారుని పేరు ఉత్తముడు. ఉద్ అనగా ఈశ్వరుడు, తమ అనగా అంధకారము (చీకటి). అంధకారం అజ్ఞానము. ఈశ్వరుని స్వరూపాన్ని గురించిన అజ్ఞానమే ఉత్తముని స్వరూపం. ఇన్ద్రియదాసుడైన తరువాత ఈశ్వర స్వరూపజ్ఞానాన్ని పొందలేడు. ఎవడు సురుచియందు కూరుకపోయాడో మఱియు విలాస జీవితాన్ని గడుపుతాడో అతనికి ఈశ్వర స్వరూపజ్ఞానం కలుగదు. అతడు ఈశ్వరుణ్ణి గుర్తించలేడు. విలాసవంతునకు ఈశ్వరజ్ఞానం కలుగదు. విరక్తునకే కలుగగలదు.

ఎట్టి వ్యక్తికి ఈశ్వర జ్ఞానం కలుగుతుంది ? అని భగవద్గీతను అడుగు. ఎవనియందు సాత్త్వికగుణాలు వృద్ధవుతాయో అతనికి ఈశ్వర జ్ఞానం కలుగుతుంది. సాత్త్విక గుణాలవృద్ధి సంయమంతో కూడిన సదాచార జీవనం గడపడంచేత కలుగుతుంది. కేవల శబ్దజ్ఞానం (వాచాజ్ఞానం) జ్ఞానం కాదు. ఉత్తమ విషయాలు క్షణిక సుఖాన్నిస్తాయి. ఆ ఉత్తమసుఖం క్షణిక విషయానన్దమై వుంది.

ఇన్ద్రియాలు మఱియు విషయాల సంయోగం (కలయిక)చే ఏక్షణిక సుఖం లభిస్తుందో అది సుఖం కాదు. కేవలం సుఖాభాసమే. దురదను గోకితే సుఖం అనిపించినా అది సుఖాభాసమే. సుఖం గాదు.

అనుభవించాలనే కోరికే సురుచి. సురుచి అనే దానికర్థం వాసన. నేడు అందరికీ సురుచియే ప్రియమనిపిస్తుంది. మానవుని ప్రతి ఒక ఇన్ద్రియానికి విషయాన్ననుభవించాలనే ఆకాంక్ష వయస్సు బాగావస్తుంది. కాని అది నిలుకడగా వుండజాలదు. విషయేన్ద్రియ సంయోగంవలన క్షణిక సుఖం కలుగుతుంది. భోజనం రుచిగా వుంటే కావలసిన దానికంటే ఎక్కువ తింటే అజీర్ణం కలుగుతుంది. పైన అన్నం జీర్ణం కావడానికి మాత్రలు మింగాల్సి వస్తుంది. అట్టి సందర్భాలలో రుచి తినమంటుంది కానీ వివేకం వద్దంటుంది.

అందువలననే శంకరాచార్యులవారు ఇలా ఆజ్ఞాపిస్తున్నారు – "స్వాద్వన్నం నతు యాచ్యతాం విధివశాత్ప్రాప్తేన సంతుష్యతాం " రుచికరమైన అన్నాన్ని కోరవద్దు. దైవాధీనంతో ఏమి లభిస్తుందో దానితో సంతోషాన్ని పొందు" అని. రుచికరమైన (స్వాదిష్ట) భోజనాన్ని తినేవాడు భగవంతుని భజించలేడు. నైతిక ప్రవర్తన ఫలం ప్రారంభంలో కష్టాన్ని చ్చేదిగా వున్నా అన్తం (ఆఖరు)లో సుఖాన్నిచ్చేది. విషయానందం ఆరంభంలో సుఖప్రదంగా వున్నా పరిణామంలో దుఃఖమే కలుగుతుంది.

ఎవరి జీవనం శుద్ధంగా (నిర్మలంగా) వుందో, పవిత్రంగా వుందో అతనికి భజనానన్దం లభిస్తుంది. మఱియు ఆ యానందమే మన్నికగలదై వుంటుంది. నైతికతాప్రవర్తనకధీనుడై ఎవడు పవిత్ర జీవితాన్ని గడుపుతాడో అతనికి ఈశ్వరజ్ఞానం లభిస్తుంది. మంచి ప్రవర్తన (సునీతి) వలన శాశ్వత స్థితి లభిస్తుంది. మంచి ప్రవర్తనయొక్క (సునీతిరత) ఫలం ధ్రువం, స్థిరత. సునీతి కుమారుడు ధ్రువుడు. ధ్రువం అంటే అవినాశి అని. అనన్తసుఖానికి, బ్రహ్మానందానికి ఎప్పుడూ వినాశం కలుగదు. ఎవడు నైతికతకధీనుడై యుండునో అతనికి ధ్రువునివలె శాశ్వతానందం లభిస్తుంది.

ఒకవేళ మానవుడు సునీతికి (మంచినైతిక ప్రవర్తకు) అధీనుడైతే సదాచారి అవుతాడు. ఒకవేళ అతడు కేవలం రుచికి (ఇన్ద్రియ సుఖాలకు) అధీనుడైతే దురాచారి అవుతాడు. నీ ఎదుట ఈ రెండు ఆనందాలున్నాయి.

ఒకటి విషయానందం, రెండు పరమానందం. నీవు దేన్నిష్టపడుతావు ? భజనానన్దమే ఇష్టపడడానికి యోగ్యమైనది. మొదటి ఆనన్దం (విషయానందం) క్షణిక సుఖాన్నిస్తుంది. మఱియు దాని పరిణామం దుఃఖాన్నిచ్చేది అవుతుంది. రెండవ ఆనన్దం (పరమానందం) ప్రారంభంలో కష్టాన్నిచ్చేదిగా వుంటుంది. కానీ ఆఖరులో సుఖప్రదంగా వుంటుంది.

ఇద్దరు స్నేహితులు యాత్ర చేయడానికి బయలుదేరారు. అందులో ఒకని అలవాటు – పరుపు తలదిండు లేకపోతే నిదురరాదు. అతడు చిన్న గోతంలో పరుపును కుట్టుకున్నాడు. కానీ దాన్ని మోసేటందుకు కూలీవాడు చిక్కలేదు. అంచేత సామానంతటిని తానే మోయాల్సి వచ్చింది. దారిలో ఒక సజ్జనుడు కలిశాడు. ఈ మహాశయుని అవస్థను చూచి అన్నాడు కదా – ఈ బరువు ఎంత కష్టప్రదమో గదా ! ఇది లేకుండా యాత్ర ఎందుకు చేయడం లేదు ? అతడు జవాబిచ్చాడు ఈ బరువును నేను మోయాల్సి వచ్చినా రాత్రి నిద్రబోయేటప్పుడు చాలా ఆనందం వస్తూంది అని. రాత్రి ఆనందంకోసం దినమంతా (పగలంతా) ఈ బరువునెత్తుకొని తిరుగుచుండెను. మరి రాత్రి ఆనందం వస్తూంది గదా !

ఈ కథ ఎవరిదో గాదు. మనదే. జీవాత్మ యాత్ర చేయడానికి బయలుదేరాడు. క్షణిక సుఖంకోసరం మానవుడు దినమంతా గాడిదవలె పరిశ్రమ చేస్తున్నాడు. దినమంతా (పగలంతా) దుఃఖమనే కొండను తలపై పెట్టుకొని తిరుగుతూన్నాడు. క్షణిక సుఖం కోసరం ఎంత చింత, ఎంతో కష్టాన్ని అతను తలకు ఎత్తుకుంటున్నాడు. విషయ సుఖం క్షణికమే గాదు. తుచ్ఛమున్నూ.

ధ్రువుడు వినాశం లేని (శాశ్వత) బ్రహ్మానందం, భజనానంద స్వరూపుడు. జీవుడెపుడు బ్రహ్మానందంవైపు పోతాడో అపుడు సురుచి విఘ్నాలను కలుగజేస్తుంది. జీవబ్రహ్మల ఐక్యాన్ని కలయికను సురుచి జరుగనీయదు. ఏ మానవుడు సురుచికి అధీనుడో అతడు కామాధీనుడున్నూ అని తెలుసుకో. **(సశేషం)**



పుష్పదంత విరచిత
శివమహిమ్న స్తోత్రమ్

(గత సంచిక తరువాయి) – శ్రీ మధుసూదనీటీక

– అనువాదకులు శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

మ. టీ. – అథవా యం అతద్వ్యావృత్త్యా కార్యప్రపంచభే దాత్‌చకితం భీతం మద్భిన్నత్వేన కార్య ప్రపంచం మా పశ్యత్వితిశంకమానం శ్రుతిరభిధత్తే ఇతి పూర్వవత్ । అర్వాచీనే పదే తు కమలకంబుకౌమోదకీరథాంగకమలాలయ కౌస్తుభాద్యుపలక్షితే నవజలధరశ్యామధామని శ్రీవిగ్రహే వైకుంఠవర్తిని వేణువాదనాది వివిధ విహార పరాయణే గోపకిశోరే వా వృందావనవర్తిని కస్యమనో నా పతతి కస్య వచశ్చ నాపతతి । అపగతా తతిర్విస్తారో యస్మాత్త దపతతి. సంకుచితమిత్యర్థః । తత శ్రీవిగ్రహాను చింతనే తద్గుణానుకథనే చ విషయాంతర పరిత్యాగేన విలీయమానావస్థం మనో వచశ్చైకమాత్ర విషయతయా సంకుచితం భవతి । తవ శ్రీవిగ్రహే ఏవాసక్తం భవతీతి భావః ॥ 2 ॥

అను : లేక, (అతద్వ్యావృత్త్యా) – "బ్రహ్మభిన్న జగత్సత్యత్వభ్రాంతి " ఎవరికైనా కలుగవచ్చునేమోయను శంకాయుక్తమగు పరమాత్మను శ్రుతి వర్ణించుచున్నది. ఏమని ? " ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ " నేహ నానాస్తికించన ", " అతో ఽ న్యకార్తమ్", ద్వితీయాద్వై భయం భవతి" ఇత్యాది వచనముల చేత ద్వైత ప్రపంచమును నిషేధిస్తూ అద్వైతమును ప్రతిపాదించింది శ్రుతిమాత. పదేత్వితి, శంఖము చక్రము, గద (కౌమోదక), కమలము, కౌస్తుభమణి మరియు లక్ష్మీసమేత వైకుంఠవాసియగు నవఘన శ్యామ శ్రీ విగ్రహము శ్రీ విష్ణువునందు వేణువాదనాది నానావిహారములలో తత్పరుడు, బృందావనవర్తి గోపకిశోరునియందు యెవరియొక్క వాణి

మరియు మనస్సు (న ఆపతతి = నాపతతి)= సంకుచితము కాదు ? అనగా నీ యొక్క శ్రీ విగ్రహానుచింతనమునందు, గుణానుకథనమునందు అన్యమగు సమస్త విషయములను త్యజించి ఏకాగ్రతను పొంది. మనస్సు మరియు వాణి అవశ్యముగా తన్మయమగును. 2.

వివరణము : శ్రీ పుష్పదంతాచార్యులంటున్నారు – భక్తుల సకల దుఃఖములను హరించు ఓ హర !(శివ) నీయొక్క స్వరూపము, మహిమ అవాఙ్మానస గోచరము (మనోవాక్కులుకు అందనిది) "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" అని చెప్పబడినట్లు పరమాత్మను అతని మహిమను వేదములు తప్ప మరెవరును వర్ణించలేరు. అటువంటి వేదము గూడ పరమాత్మను సాక్షాత్తుగా ముఖ్యవృత్తిచేత బోధించుటకు భయపడి (విస్మయములోపడి) అతద్వ్యావృత్తి (లక్షణా) చేత బోధించినది. "తద్ శబ్దమున కర్థము పరమాత్మ. అతద్ = న+తద్ = పరమాత్మకానిది = అనగా జగత్తు. వ్యావృత్తి = వేరుచేయుట, వదలిపెట్టుట, త్యాగము చేయుట, నిషేధము ఇత్యాది. అతద్వ్యావృత్తి = బ్రహ్మ భిన్న జగత్తును వదిలితే అవశిష్టము (మిగిలేది) పరమాత్మయే. దీనినే ఉపనిషత్తులు నేతి నేతి ఇత్యాది వాక్యములచే బోధించుచున్నవి. పరమాత్మను బోధించుటకు శ్రుతి యెదుట సమస్య ఏర్పడింది. అనగా ముఖ్యము (వాచ్యార్థము) కుంటుబడినపుడు అతద్వ్యావృత్తి ప్రక్రియను స్వీకరించవలసి వచ్చింది.

ఉదాహరణము : ఒకానొక బాలకుడు ఎప్పుడూ సినిమా చూడలేదు. కాని, సినిమాలో ఒక పరదా (తెర) ఉంటుంది. దానిపైబొమ్మలు (చిత్రములు) కనిపిస్తాయి అని వినియున్నాడు. ఒకరోజు తన తండ్రితోపాటు సినిమా చూచుటకు వెళ్ళెను. వీరిద్దరు లోనికి ప్రవేశించుటకు పూర్వమే సినిమా ప్రారంభమయ్యినది. హాలులోకి ప్రవేశించుటతోడనే పిల్లవాడు తండ్రిని అడిగాడు. ఇచ్చట తెరయేది ? తండ్రికి సమస్య ఏర్పడింది. తెర అయితే ఉంది కాని బాలునికి ఎలా బోధించేది ? ఎక్కడ అంగుళి నిర్దేశము చేయునో (వ్రేలితో చూపెట్టునో), అక్కడ చిత్రమే కాన్పించును. ఒకవేళ

తెరపై చేయి నుంచి 'ఇదుగో ఇది తెర ఉంది" అని చెప్పినచో, అక్కడున్న చిత్రవే తెరకాబోలు అని బాలుడు భావించవచ్చును. లేక ఈ కనుపించునుది అంతయు తెరయే అని చెప్పినచో, కనుపించు బొమ్మలన్నిటిని కలిపి తెరగా భావించవచ్చును. చివరకు తండ్రి బాలునితో అంటాడు. బాబూ ! ఈ చిత్రములన్ని దేనిపై కనుపించుచున్నవో, యేది లేకుంటే చిత్రములు కనుపించవో అది "తెర" అని తెలిసికో! ఇట్లు చిత్రములను నిషేధిస్తూ శేషమగు తెరను బోధించెను. ఇదే విధముగా శ్రుతిగూడ బ్రహ్మతత్త్వమును అనేక ప్రక్రియల ద్వారా బోధించి చివరకు అతద్వ్యావృతి (లక్షణా) ప్రక్రియను స్వీకరించి అద్వైతము (జీవబ్రహ్మైక్యము జగద్బ్రహ్మైక్యము)ను ప్రతిపాదించినది. (ఇట్లు 'అతద్వ్యా వృత్తి " శబ్దమునకు నిషేధముఖముగా అర్థమును తెలిసికున్నాము).

ఇప్పుడు "అతద్వ్యా వృత్తి" శబ్దమునకు విధి ముఖముగా (అన్వయ ముఖముగా c అర్థమును తెలిసికొందము. పై దృష్టాంతములో ఇట్లు చెప్పవలసి వచ్చును. ఏమనగా ! ఇదంతయు తెరమాత్రమే. చిత్రములు కానుపించుచున్నవి. కాని వాస్తవముగా తెరపై లేవు. అట్లే సముద్రముపై అలలు అగుపించును, కాని అక్కడ వాస్తవముగా నీరు మాత్రమే ఉంది. స్వప్నము గోచరించును, కాని అక్కడ ఉన్నది కేవలము సాక్షియే. " నతత్ర రథాఃరథయోగా పంథానో " తెరయే బొమ్మలవలె తోచుచున్నది. నీరే అలలవలె ప్రతీతి యగుచున్నది. సాక్షియే రథ తురగాదులవలె గోచరించుచున్నది. అట్లే బ్రహ్మమే జగత్తువలె గోచరించుచున్నది. దృశ్యమాన విశ్వమంతయు బ్రహ్మమునందు తదజ్ఞానముచే కల్పితము (మిథ్యా, అధ్యస్తము) రజ్జు సర్పము వలె, త్రాడుకంటె వేరుగు పాము లేదు. " నిరధిష్ఠాన విభ్రాన్తేః క్వాప్యసిద్ధితః " " కల్పిత వస్తునః అధిష్ఠాన స్వరూపమేవ." కావున అతద్వ్యావృత్తి ప్రక్రియచేత "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఈ జగత్తంతయు బ్రహ్మమే అని శ్రుతి బోధించుచున్నది. (అతద్వ్యా వృత్తి) తస్య వ్యావృతిః ఇతి తద్వ్యావృతిః" తద్ అనగా పరమాత్మ, వ్యావృతి అనగా తొలగించుట

– పరమాత్మను తొలగించుట " న తద్వ్యావృతిః ఇతి అతద్వ్యావృతిః" అనగా పరమాత్మను తొలగించకుండుట – సర్పము బ్రహ్మమే.

ఈ ప్రకారముగా జగత్తును నిషేధించి అవశిష్ట బ్రహ్మమును బోధించుట (నిషేధ ముఖము), జగత్తంతయు బ్రహ్మముకంటే వేరుగాదు. మరేమనగా బ్రహ్మమేయని చెప్పుట (విధిముఖము) అనబడును. ఇట్లు "ఇదంతయు " అనగా ఇదమిత్థమంటూ " ఇది పరమాత్మ యొక్క మహిమ, స్వరూపము" అని వేదము (శబ్దము) చేతగూడ చెప్పనలవిగాని వాడు, యెవరి యొక్క స్తుతికి విషయమగును ? పరమాత్మను సగుణముగా భావించి స్తుతించినచో, అనంతగుణములు (విభూతులు) గలవాడున్నాడు. నిర్గుణముగా భావించి కీర్తించినచో, అప్రమేయుడు (ఏ ప్రమాణమునకు విషయము గాని వాడు)ను, నిర్ధర్మక స్వరూపుడును అయి ఉన్నాడు. కావున ఏ ప్రకారము చేత గూడ పరమాత్మ మనోవాక్కులకు విషయము గాదు. (వాక్కుచేత ఉపలక్షణముగా ఏ ఇంద్రియమునకు విషయము గాడు అని తెలిసికోవలెను). " యన్మనసా న మనుతే యేనాహుర్మనో మతమ్ " "యద్వాచా నభ్యుదితం యేన వాగభ్యుద్యతే" ఇత్యాద్యనేక ప్రమాణములు పరమాత్మను అవాఙ్మానసగోచరమని ఉద్ఘోషిస్తున్నవి. ఇలాంటప్పుడు నీ వెలా నన్ను స్తుతించగలవు? అను శంక ప్రాప్తించగా,..

శ్రీ పుష్పదంతాచార్యులు సమాధానము చెప్పుచున్నారు. నిజమే నీయొక్క నిర్గుణ నిరాకార స్వరూపమును మరియు సగుణ నిరాకార స్వరూపమును వర్ణించుట కెవరికిని శక్యము గాదు. కాని, కృపావశమున భక్తానుగ్రహార్థము ధారణ చేసికున్న నీ నవీన సగుణసాకార విగ్రహము నందు యెవరియొక్క మనస్సు మరియు వాణి ప్రవేశించదు ?

శ్లో ॥ కర్పూరగౌరం కరుణావతారం,
సంసారసారం భుజగేంద్రహారమ్ ।
సదా వసంతం హృదయారవిందే,
భవం భవానీ సహితం నమామి ॥

అర్థము : కర్పూరమువంటి వన్నెగలవాడును, సర్పములే హారముగా గలవాడును, సంసారమునకు సారము (అధిష్ఠాము) అయిన వాడును, భక్తానుగ్రహార్థము కరుణావశమున అవతరించిన వాడును, ఎల్లపుడు భక్తుల హృదయ పద్మమున నివసించువాడును పార్వతీ సహిత పరమ శివునిగూర్చి నేను నమస్కరించుచున్నాను.

''స్యాత్పరమేశ్వరస్యాపీచ్ఛావశాన్మాయామయం రూపం సాధకానుగ్రహార్థమ్ " (బ్ర.సూ. 1--1-20) సాధకులను (భక్తులను) అనుగ్రహించుట కొఱకు ఇచ్ఛావశమున పరమేశ్వరునియొక్క మాయామయరూపము (అవతారము) కలుగవచ్చును. "అవతారాహ్య సంఖ్యేయా "భూమేర్భారావతారాయ" (భాగవతము) "యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి " పరిత్రాణాయ సాధూచాం వినాశాయచ దుష్కృతామ్" " అజో ఽపి సన్ .... ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా " (గీత) ఇత్యాది వచనములు – నిర్గుణము , నిరాకారము, అజము అవ్యయము అగు పరమాత్మగూడ భక్తులను అనుగ్రహించుటకోసము (ఉపాసనార్థము) మాయామయ (లీలా) విగ్రహమును ధరించి అవతరిస్తాడు. అని చెప్పుచున్నవి. (భగవంతుని యొక్క 'అవతార విశేష వర్ణన " మాచే రచింపబడిన " భక్త తుకారాం అభంగవాణి '' అనుగ్రంథమున గనందగును) కావున, కర్పూరగౌరవర్ణము, శిరమున జటాజూటము, దానియందు పరమపావని గంగ, మస్తకమున చంద్రవంక, చేతిలో త్రిశూలము, సర్పమాల, పులిచర్మమును మరియు విభూతిని ధరించిన పార్వతీసమేత పరమ పావన సగుణసాకార విగ్రహమునందు జీవన్ముక్తులు మొదలుకొని పామరుల వరకు అందరియొక్క మనస్సు మరియు వాణి లగ్నమై పరవశించి ప్రవేశించగలదు. అందరును నిన్ను స్తుతించుటకు సమర్థులగుదురు. అందువలన నేను గూడ నిన్ను స్తుతించగలను.

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

పాశుపతాస్త్రాన్ని పొందడం, దేవేంద్రుని అర్ధసింహాసనాన్ని అధిష్ఠించడం, కాలకేయ నివాత కవచుల మీద విజయాన్ని సాధించడం, ఉత్తర గోగ్రహణ విజయం, ఉత్తర ముద్దు చెల్లించడం ఇవన్నీ ఆయన కరుణలేకపోతే జరిగి ఉండేవా ? కురుక్షేత్ర యుద్ధంలో విజయసారథి ఆయనే కదా ! వైరుల శస్త్రాస్త్రాలు నన్నేమీ చేయలేకుండా వమ్మై పోయాయంటే కారణం ఆ మహాత్ముని కరుణే కదా ! సైంధవుని వధించే రోజున నా దివ్యబాణాలతో భూమిని పగులదీసి జలాశయాన్ని ఏర్పరచి రథాశ్వాల దప్పిక తీర్చాను. అది ఆ మాధవుని చలువవల్లనే కదా !

ఆ వాసుదేవుడు నామీద చూపిన అనురాగాన్ని, అనుగ్రహాన్ని మరచిపోయేందుకు ఎలాసాధ్యం అవుతుంది మహారాజా ? ఒకసారి చెలికాడా రమ్మని చేరబిలుస్తాడు. ఒకమాటు మరిదిగా మన్నిస్తాడు. ఒక పర్యాయం ఆత్మబంధువుగా ఆదరిస్తాడు. ఇంకొకసారి దాతగా ధనం సమకూరుస్తాడు. ఒకమారు మంత్రిగా సలహా చెబుతాడు. ఒకసారి సారథ్యం చేస్తాడు. ఒకసారి నాతో కలిసి భోంచేస్తాడు. ఒక్కొక్కసారి కన్న తండ్రిలా తప్పు సరిదిద్దుతాడు. పేర్లు పెట్టి ఎంత ఆప్యాయంగా పిలిచేవాడో కదా ! అంతఃపుర స్త్రీలతో ప్రణయకలహం ఏర్పడితే వాళ్ళ అలుక తీర్చి నచ్చ చెప్పేందుకు వాళ్ళ ఇండ్లకు నన్ను పంపేవాడు. నా ఒడిలో తలపెట్టుక పడుకొని తనకు, తన ప్రియురాళ్ళకూ మధ్య జరిగే వాటన్నిటినీ పూసగుచ్చినట్టు రహస్యంగా చెప్పేవాడు. ఇంత ఆత్మీయంగా నాతో మసలుకున్న మాధవుడు మహీమండలాన్ని విడిచి వెళ్ళిపోయినా నా ప్రాణాలు ఇంకా నిలిచే ఉన్నాయి. ఎన్ని పాపాలు చేశానో ఏమో.

ఆ గోవిందుడు శరీరాన్ని విడిచాక ఆయన భార్యలు పదహారు వేలమందినీ తీసుకొని హస్తినకు బయలుదేరాను. దారిలో దుర్మార్గులైన కిరాతకులు తారసపడ్డారు. నేనప్పుడు వారిని ఏమీచేయలేక ఆడుదానిలా ఉండిపోయాను. నా రథమూ బాణాలూ అన్నీ కూడా నిష్ప్రయోజనాలై పోయాయి. రాజా ! నువ్వడిగిన యాదవులందరూ మునుల శాపం వల్ల ఒకరినొకరు కొట్టుకొని మరణించారు. నలుగురైదుగురు మాత్రమే మిగిలారు. ఆ పరమేశ్వరుడు సర్వభూతాంతర్యామి, ప్రాణుల సృష్టి, స్థితి, లయాలను కూడా ఒక ప్రాణికి మరొక ప్రాణి ద్వారా జరిపిస్తాడు. కృష్ణుడు ఈ విధంగా భూభారం నశింపజేశాడు. తను వచ్చిన పని ముగించుకొని వెళ్ళిపోయాడు ” అని అర్జునుడు ధర్మరాజుకు చెప్పాడు.

యుద్ధభూమిలో భగవానుడైన కృష్ణుడు తనకు బోధించిన భగవద్గీతా వాక్యాలను పార్థుడు మళ్ళీ గుర్తు చేసుకున్నాడు. శోకాన్ని పరిత్యజించాడు. కార్యకారణాలను బాగా వితర్కించుకున్నాడు. శోకానికి అహంకార మమకారాలతో కూడిన ద్వైతభ్రాంతే కారణం. వానికి కారణం శరీరం. లింగమే ఆ శరీరానికి కారణం. ఆ లింగానికి సత్త్వరజస్తమో గుణాలు కారణం. ప్రకృతే ఆ గుణాలకు కారణం. ‘అహం బ్రహ్మాస్మి ’ అనే జ్ఞానంతో ప్రకృతి నశిస్తుంది. ప్రకృతి విలీనం కావడంతో గుణాలు లేకుండాపోతాయి. గుణాలు లేకపోవడం వల్ల లింగ శరీర నాశనానికి దోహదమేర్పడుతుంది. ఈ విధంగా ప్రకృతిని పరిత్యజించిన పురుషుడు మళ్ళీ స్థూలశరీరాన్ని పొందడు. అర్జునుడికి ఈ అవగాహన ఏర్పడింది. విరక్తి కలిగింది.

ఏవేవి లోకనింద్యాలో, అధర్మకార్యాలో బాధపడవలసినవో ధర్మరాజు మాటలను బట్టి గ్రహించవచ్చు. వాటిపట్ల జాగ్రత్త వహించవచ్చు. కృష్ణ నిర్యాణం అర్జునుడిలో ఎటువంటి విషాదాన్ని కలిగించిందో ఈ ఘట్టం తెలియజేస్తుంది. కృష్ణార్జునుల అనుబంధాన్ని బోధపరుస్తుంది. ఆత్మీయులు ఎలా మసలుకోవాలో అభివ్యక్తం చేస్తుంది. కృష్ణుడు పాండవుల పట్ల కనబరచిన అభిమానాన్నీ, పాండవులు కృష్ణుడిపట్ల ఏర్పరచుకున్న భక్తినీ, కృతజ్ఞతాభావాన్ని గ్రహించడానికి దోహదమేర్పడుతుంది. పెద్దలవలన విన్న వాక్యాలను మళ్ళీ మళ్ళీ స్మరించుకొని తదనుగుణంగా మసలుకొని

దుఃఖాన్ని అధిగమించాలని అర్జునుడి ప్రవర్తన వల్ల బోధపడుతుంది. దుఃఖాన్ని అధిగమించడంలో అర్జునుడు అవలంబించిన విధానం అందరికీ అనుసరణీయమని అభివ్యక్తమౌతుంది.

మహాభినిష్క్రమణ : అర్జునుడు చెప్పిన యాదవ వినాశ వృత్తాంతాన్ని విన్న ధర్మరాజు నారదుడు చెప్పిన మాటల్ని గుర్తు చేసుకున్నాడు. పుణ్యలోకాలను పొందే మార్గాన్ని గురించి ఆలోచింపసాగాడు. ఈ విషయాలన్నీ విన్న కుంతి కేవల కృష్ణస్మరణతో ప్రశాంతంగా శరీరాన్ని విడిచిపెట్టింది. ఎప్పుడైతే కృష్ణుడు తన శరీరాన్ని విడిచాడో అప్పుడే అమంగళకరమైన కలియుగం ప్రారంభమైంది.

కలియుగం వచ్చింది. అధర్మం పెరిగింది. అసత్యం, ఆడంబరం అధికమయ్యాయి. హింస, క్రౌర్యం, కుటిలత్వం ఎక్కువయ్యాయి. ధర్మరాజు పరిస్థితిని గమనించాడు. తాను రాజుగా కొనసాగడం తగదనుకున్నాడు. హస్తినాపుర సింహాసనం మీద పరీక్షిత్తును కూర్చోబెట్టాడు. అనిరుద్ధుని కుమారుడైన వజ్రుణ్ణి మధురలో యాదవరాజ్యానికి రాజుగా చేశాడు.

ధర్మరాజు వైరాగ్యాన్ని అవలంబించాడు. నారచీరలు ధరించి ఉత్తరాభిముఖంగా ప్రయాణం సాగించాడు. భీముడు తక్కిన పాండవులు కూడా దానధర్మాలు చేశారు. విష్ణుధ్యానంతో గడిపారు. కొన్నాళ్ళకు తమ శరీరాలను పరిత్యజించి విష్ణులోకానికి వెళ్ళారు. ద్రౌపది కూడా వాసుదేవుడి మీద మనస్సు నిలిపి శరీరం విడిచి భగవంతుణ్ణి చేరుకుంది. విదురుడు భగవంతుని మీద మనస్సు లగ్నంచేసి ప్రభాస తీర్థంలో శరీరాన్ని పరిత్యజించాడు. తన పూర్వపు యమధర్మరాజు ఆకారం ధరించాడు. పితృ దేవతలతో కలిసి వెళ్ళి పూర్వపు అధికార పీఠాన్ని అధిరోహించాడు.

కాలవైపరీత్యాన్ని దృష్టిలో ఉంచుకొని సముచితంగా స్పందించడం సమంజసమని ఈ సంఘటనలు తెలియజేస్తున్నాయి. జీవితం చివరిదశలో ఎంత తీవ్రంగా పారమార్థిక చింతన చెయ్యాలో ఇక్కడ స్పష్టమౌతుంది. పరిస్థితులు ప్రతికూలమైనప్పుడు కేవల భోగలాలసతతో పదవిని అంటిపెట్టుకోవడం సమంజసం కాదని ధర్మరాజు నిర్ణయం బోధపరుస్తుంది

వార్తలు

(01). అక్టోబరు 1వ తేది నుండి 6వ తేది వరకు 5వ జ్ఞాన సదస్సు శ్రీశుకబ్రహ్మాశ్రమం శివాలయంలో జరిగినది. పూజ్యశ్రీ యజ్ఞానందసరస్వతి స్వాములవారు (చిన్మయమిషన్, సిద్ధిపేట) ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 8 గం॥ 30 వరకు, సాయంకాలము 4 గంటల నుండి 5-30 గం॥ వరకు మాండూక్యోపనిషత్తు గౌడపాదకారికలతోటి చెప్పారు. సదస్యులు 20 మంది పాల్గొన్నారు. శ్రీస్వామివారి ప్రవచన చాల వివరణాత్మకంగా వుండినది. సదస్యులు చాలా ఆనందించారు.

(02). 6వ జ్ఞానసదస్సు అక్టోబరు 31వ తేది ప్రారంభమైనది. నవంబరు 4వ తేది కార్తీక పౌర్ణమి వరకు జరుగును. పూజ్యశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు (శ్రీ వసిష్ఠాశ్రమాధిపతులు) ప్రశ్నోపనిషత్తును చెప్పుచున్నారు.

(03). అనంతపురం జిల్లా, గుంతకల్లు సమీపం గూళ్లపాళెంలోని ఉమామహేశ్వర పీఠగురు దేవ ఆశ్రమంలో ప్రస్తుతపీఠాధిపతులు పూజ్యశ్రీ ప్రణవానందగిరి స్వాములవారిచే జీర్ణోద్ధరణ గావించబడిన నూతన నిర్మిత భవన ప్రారంభోత్సవంలో నవంబరు 20,21,22 తేదీ లందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొందురు.

(04). నూతనంగా ఏర్పఱచిన చైతన్య ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశుకబ్రహ్మాశ్రమమునందు ప్రభుత్వం గుర్తించిన 90 రోజుల యోగ – ఆయుర్వేద – ధ్యాన వైద్య శిక్షణా శిబిరం ప్రారంభింపబడనున్నది. అందు కనీసం 10వ తరగతి చదివిన 30 మందికి మాత్రమే ప్రవేశముండును. శిక్షణ 90 రోజులు పూర్తి అయిన తరువాత పరీక్షలుండును. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులకు ప్రభుత్వం వారి సర్టిఫికెట్లు ఇవ్వబడును. వీరు గ్రామాలలో గాని, పాఠశాలలో గాని, ఫ్యాక్టరీలలో గాని యోగ బోధకులుగా స్వీకరింపబడుదురు.

(05). అక్టోబరు 19వ తేది దీపావళి సందర్భంగా శ్రీశుక బ్రహ్మాశ్రమంలో దీపాలతో ప్రణవం ఏర్పఱచి ప్రణవ పూజ చేయబడినది.

(06). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో సెప్టెంబర్ నెలలో ఓ.పి.లో **799** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. **91** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **ఇద్దరికి** యాగ్ లేజర్ చికిత్సలు చేయబడినవి.